


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX






ఎడిటర్: మహేష్ యాదవ్ | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 278 | శనివారం 17 - 10 -2026 | పేజీలు : 12 | వెల-3

Published From : KURNOOL circulated at Nandyal Alluri SitharamaRaju,Anakapalli,Anantapur,Annamayya,Bapatla,Chittoor, Konaseema,East Godavari,Eluru,Guntur,Kakinada,Krishna,,NTR, Palnadu,Parvathipuram Manyam,Prakasam,Nellore,Sri Sathya Sai,Srikakulam,Tirupati,Visakhapatnam,Vizianagaram,West Godavari, YSR Kadapa,Hyderabad,Ranga Reddy,Medchal-Malkajgiri,Warangal,Hanamkonda,Nizamabad,Karimnagar, Khammam,


# ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

- విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న సీఎం చంద్రబాబు దంపతులు
- ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పణ
- ముఖ్యమంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అధికారులు
- దర్శనానంతరం పండితుల వేదాశీర్వచనం
- దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు

2లో



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి శుక్రవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారెను వారు సమర్పించారు. ఇంద్రకీలాద్రికి చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయ కార్యనిర్వహణాధికారి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో వారిని అమ్మవారి దర్శనానికి తీసుకువెళ్లారు. గర్భాలయంలో చంద్రబాబు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి పట్టువస్త్రాలను, ఆయన అర్ధాంగి సారెను అమ్మవారికి సమర్పించారు. దర్శనం ముగిసిన అనంతరం, ఆలయ పండితులు ముఖ్యమంత్రి దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం వారికి అమ్మవారి తీర్థప్రసాదాలను, జ్ఞాపికను అందజేశారు. దసరా నవరాత్రుల సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## స్థానిక ఎన్నికలకు టీడీపీ అభ్యర్థుల ప్రకటన

2లో

# లెక్క తేలింది..!

**ఏలూరు జనసేనకు.. జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి టీడీపీకి..**
**ప్రకటించిన కూటమి పార్టీల అధిష్ఠానాలు..**
**ఏలూరు టీడీపీలో అసంతృప్తి**
**మేయర్ అభ్యర్థిగా జనసేన నుంచి అప్పలనాయుడు.. వైసీపీ నుంచి జీఎంఆర్**
**మున్సిపోల్స్‌కు నేటి నుంచే నామినేషన్లు..**
**ప్రత్యేక కౌంటర్ల ఏర్పాట్లు**

2లో

స్థానిక సంస్థల ఎన్నికలపై కూటమిలో సర్దుబాటు లెక్కలు తేలాయి. మున్సి పాలిటీలకు శుక్రవారం నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చింది. జిల్లాలో ఏలూరు కార్పొరేషన్ మేయర్ పదవిని జనసేనకు కేటాయించారు. ఈ సీటును ఆశించిన రెడ్డి అప్పలనాయుడుకు లైన్ క్లియర్ అయ్యింది. నూజివీడు(ఎస్సీ జనరల్) జంగారెడ్డిగూడెం(బీసీ మహిళ)తోపాటు చింతలపూడి నగర పంచాయతీలలోని చైర్మన్ సీట్లు టీడీపీకే కేటాయించారు. ఈ మూడుచోట్ల చైర్మన్ అభ్యర్థిత్వాలతోపాటు వార్డుల సర్దుబాట్లు కొలిక్కి రాలేదు. ఈనెల 19 నుంచి ఎంపీ టీసీలు, జడ్పీటీసీలకు నోటిఫికేషన్ విడు దల కానుంది. ఆ తర్వాత పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నిక నిర్వహిస్తారు.





# రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం

2లో

- కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపణ
- పది నెలల్లో మోదీ సర్కార్ పడిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ
- 2029 వరకు మోదీ ప్రధానిగా ఉండాలని ప్రజలు తీర్పు ఇచ్చారని వ్యాఖ్య

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన "తాటాకు చప్పుళ్లు"గా అభివర్ణించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది" అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు.

## మేడ్చల్‌లో నకిలీ రిజిస్ట్రేషన్ల దందా.. ముగ్గురి అరెస్ట్

2లో



## డిండి ప్రాజెక్టు రద్దు చేయకపోతే ఉద్యమమే:

2లో



## ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం:

2లో





# క్షేత్రస్థాయిలో కరెంటు యంత్రాంగం

- సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర హెచ్చరికతో కదలిక
- యాదాద్రి ప్లాంటులో జెన్‌కో సీఎండీ హరీశ్,
- ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్‌మిట్టల్ మకాం
- కరెంటు ఉత్పత్తి పెంచేందుకు చర్యలు
- ఈ నెల 30వ తేదీ వరకూ అక్కడే మరో ఐదుగురు ఐఏఎస్‌లు
- రాష్ట్రవ్యాప్తంగా రోజూ ఉదయం 7-8 గంటల మధ్య సమీక్షలు,

2లో

'వచ్చే 20 రోజులు పంటలకు అత్యంత కీలకం. ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ కొరత కారణంగా రైతులు పంట నష్టపోకూడదు. విద్యుత్ అంతరాయాలకు రోజుకో కారణం చెప్పొద్దు. అంతరాయాలు ఇలాగే కొనసాగితే ఉన్నతాధికారులను కూడా సస్పెండ్ చేస్తా'నంటూ ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో విద్యుత్‌శాఖ యంత్రాంగమంతా రంగంలోకి దిగింది. విద్యుత్ సంస్థల అధిపతుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకూ కదిలారు.

# సత్యసాయి జిల్లాలో విషాద ఘటన.. నీట మునిగి ఐదుగురు మహిళలు మృతి..

- శ్రీ సత్యసాయి జిల్లాలో దుర్ఘటన
- గొల్లపల్లి జలాశయంలో మునిగి ఐదుగురు మహిళలు మృతి
- విహారయాత్రకు వెళ్లి సరదాగా ఈతకు దిగడంతో ఘటన
- మృతుల కుటుంబాలకు మంత్రి నారా లోకేశ్ ప్రగాఢ సానుభూతి



శ్రీ సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. పెనుకొండ సమీపంలోని గొల్లపల్లి జలాశయంలో ఈతకు వెళ్లి ఐదుగురు మహిళలు నీట మునిగి మృతి చెందారు. విహారయాత్ర కోసం వెళ్లిన వీరి జీవితాల్లో ఈ సంఘటన అంతులేని విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే, పెనుకొండ పట్టణంలోని దర్గాపేటకు చెందిన కొందరు మహిళలు శుక్రవారం విహారయాత్ర కోసం గొల్లపల్లి జలాశయానికి వెళ్లారు. వీరిలో ఐదుగురు సరదాగా ఈత కొట్టేందుకు నీటిలోకి దిగారు.

# జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్



- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జనసేన ప్రచార రథం ప్రారంభం
- 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్'ను జెండా ఊపి ప్రారంభించిన పవన్ కల్యాణ్
- అభ్యర్థి గడల శ్రీనివాసరావు గెలుపునకు పలు సూచనలు

2లో

# క్షేత్రస్థాయిలో కరెంటు యంత్రాంగం

జెన్‌కో సీఎండీ ఎస్ హరీశ్ బుధవారం నుంచి యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్(వైటీపీఎస)లోనే మకాం వేశారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్‌మిట్టల్ కూడా రెండురోజులుగా అక్కడే ఉన్నారు. వైటీపీఎసలో ఐదు యూనిట్లున్నాయి. ఒక్కో యూనిట్ సామర్థ్యం 800 మెగావాట్లు. నాలుగు యూనిట్లలో వాణిజ్య ఉత్పత్తి ఇప్పటికే ప్రారంభం కాగా, యూనిట్-5లోనూ వారం రోజుల్లో మొదలుపెట్టాలని అధికారులు భావిస్తున్నారు. వైటీపీఎస్ ప్రస్తుతం నిర్మాణ దశలోనే ఉంది. పలు సాంకేతిక సమస్యలు ఉన్నప్పటికీ ఈ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం నాలుగు యూనిట్లలో జరుగుతున్న ఉత్పత్తి (పీఎల్‌ఎఫ్) కూడా వాటి పూర్తి సామర్థ్యానికి అనుగుణంగా లేదు. జెన్‌కోకు చెందిన అన్ని ప్లాంట్ల కన్నా యాదాద్రి ప్లాంట్‌లోనే పీఎల్ఎఫ్ అత్యల్పంగా ఉంది. నిర్మాణ సమస్యలను పరిష్కరించే పీఎల్‌ఎఫను పెంచే పనిలో యంత్రాంగం పడింది. బీహెచ్ఈఎల్ సిబ్బందితో కలిసి ప్లాంట్‌లోని సమస్యలను ఒక్కటొక్కటిగా పరిష్కరించడానికి వీలుగా నవీన్‌మిట్టల్, ఎస్ హరీశ్ చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐదుగురు ఐఏఎస్ అధికారులు ఈ నెల 30వ తేదీ దాకా వైటీపీఎసలోనే ఉంటూ పనులను పర్యవేక్షించనున్నారు.

**పొలాల వద్దకు విద్యుత్ సిబ్బంది** ఎల్‌నినో నేపథ్యంలో రైతులకు అండగా నిలిచేందుకు విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పంట పొలాల వద్ద పర్యటించేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. వరి కోతలు పూర్తయ్యే వరకు ఉదయం 7-8 గంటల వరకు జిల్లాల వారీగా ఉన్నతాధికారులతో సమీక్షలు జరుపుతామని, ఆ తర్వాత 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ అధికారులు, సిబ్బంది పొలాల వద్ద పర్యటిస్తారన్నారు. ఎల్‌నినో ప్రభావం నుంచి బయటపడేందుకు తక్కువ నీటితో పండించే పంటలపై అవగాహన కల్పిస్తామన్నారు. సంగారెడ్డి, మెదక్, నల్లగొండతోపాటు పలు జిల్లాల్లో వరిసాగు చివరిదశకు చేరుకున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా, తరుచూ క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకుంటునట్లు తెలిపారు. వానలు సరిగా పడకపోవటంతో, రాబోయే రోజుల్లో పశుగ్రాసంపై తీవ్రప్రభావం ఉండే అవకాశం ఉందని, దీనికి తగినట్లుగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భజలాలు అడుగంటిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పొలాలకు నీళ్ల కోసం బోర్లు, పంపుసెట్లను గంటల కొద్దీ నిర్విరామంగా నడిపించడంతో పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్‌లోడ్ పడుతోందన్నారు. అయినప్పటికీ పంటలు ఎండిపోకుండా తమవైపు నుంచి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని, ట్రాన్స్‌ఫార్మర్లు పాడైతే 24 గంటల్లో వాటిని మార్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు జితేష్ పాటిల్ పేర్కొన్నారు.

## మేడ్చల్‌లో నకిలీ రిజిస్ట్రేషన్ల దందా.. ముగ్గురి అరెస్ట్

**మేడ్చల్ జిల్లాలో ముగ్గురు సభ్యుల ముఠా అరెస్ట్**

**ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ. 6 లక్షలు వసూలు**

**నిందితుల నుంచి నకిలీ పత్రాలు, స్టాంప్ పేపర్లు స్వాధీనం**

**జీడిమెట్ల పరిధిలో వెలుగు చూసిన మోసం**

నకిలీ పత్రాలను సృష్టించి అక్రమ రీతిలో భూముల రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న ఓ ముఠా గుట్టును మేడ్చల్ పోలీసులు రట్టు చేశారు. ఈ మోసానికి సంబంధించి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసిన పోలీసులు, వారి వద్ద నుంచి కీలకమైన నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని జీడిమెట్ల ప్రాంతంలో ఈ అక్రమ ఉదంతం వెలుగులోకి వచ్చింది. నిందితులు ప్రధానంగా నకిలీ అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) క్లియరెన్స్ పత్రాలను రూపొందించారు. వీటిని ఆధారంగా చేసుకుని జీడిమెట్ల ప్రాంతంలోని సర్వే నంబర్లు 192, 193లో గల భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించారు. ఒక్కో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు నిందితులు సుమారు రూ.6 లక్షల మేర వసూలు చేసినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. ఇప్పటివరకు రెండు అక్రమ రిజిస్ట్రేషన్లను వీరు పూర్తి చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ భారీ మోసంపై సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే స్పందించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నకిలీ యూఎల్‌సీ పత్రాలతో పాటు స్టాంప్ పేపర్లను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాలలో ఇటీవల భూ సంబంధిత అక్రమాలు పెరుగుతున్న తరుణంలో అధికారులు నిఘాను మరింత తీవ్రతరం చేశారు. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరి హస్తమైనా ఉందా? వీరు గతంలో మరిన్ని మోసాలకు పాల్పడ్డారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

# డిండి ప్రాజెక్టు రద్దు చేయకపోతే ఉద్యమమే:

**పాలమూరు నీటిని డిండికి తరలించి రైతులను మోసం చేస్తున్నారని డీకే అరుణ ఆరోపణ**

**జిల్లాకు మేలు చేయనప్పుడు రేవంత్ రెడ్డికి సీఎం పదవి ఎందుకని ప్రశ్న**

**పదేళ్లలో ఆర్డీఎస్‌కు కేసీఆర్ చేసిందేమీ లేదని విమర్శ**

డిండి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే రద్దు చేయాలని బీజేపీ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. పాలమూరు రైతులకు కేటాయించిన నీటిని డిండికి తరలించి, స్థానిక రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆమె తీవ్రంగా ఆరోపించారు. ఈ ప్రాజెక్టును రద్దు చేయని పక్షంలో జిల్లా వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని ఆమె హెచ్చరించారు. మహబూబ్‌నగర్‌లో పాలమూరు-రంగారెడ్డి పెండింగ్ ప్రాజెక్టులపై బీజేపీ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో డీకే అరుణ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. జిల్లా ప్రజలకు మేలు చేయని సీఎం కుర్చీ రేవంత్ రెడ్డికి ఎందుకు? అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డిజైన్‌లో మార్పులు చేయడం ద్వారా రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. గతంలో పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్... ఆర్డీఎస్ కోసం చేసిందేమీ లేదని డీకే అరుణ దుయ్యబట్టారు. రైతులు, అసంపూర్తిగా ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందని ఆరోపించారు. పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ తక్షణమే పూర్తి చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పాలమూరు రైతుల నీటి హక్కులను కాపాడేందుకు బీజేపీ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు.

## లెక్క తేలింది..!

**నేడు నోటిఫికేషన్లు** జిల్లాలో మూడు పురాల ఎన్నికలకు ప్రత్యేకాధికారులు నోటిఫికేషన్లను శు క్ర వారం విడుదల చేస్తారు. అనంతరం నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. ఏలూరు కార్పొరేషన్ (బీసీ జనరల్) 62 డివిజన్లు, జంగారెడ్డిగూడెం (బీసీ మహి ళ) 32 వార్డులు, నూజివీడు (ఎస్సీ జనరల్) 36 వార్డులకు ఆయా కమిషనర్ల పర్యవేక్షణలో నామినేషన్లు స్వీకరిస్తారు. ఏలూరులో 16 మంది ఆర్వోలను నియ మించగా, ఒక్కో రూమ్‌లో నాలుగు డివి జన్లకు, జంగారెడ్డిగూడెంలో నాలుగుచోట్ల 8 వార్డుల చొప్పున నలుగురు ఆర్వోలు, నూజివీడులో పది మంది ఆర్వోలు నాలు గు వార్డుల చొప్పున నామినేషన్ల స్వీకరిస్తారు. పోలీస్ అధి కారులు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిం చారు. అభ్యర్థితోపాటు ఐదుగురిని అను మతించనున్నారు. మూడు రోజులపాటు నామినేషన్ల స్వీకరిస్తారు. 19న నామినేషన్ల పరిశీలన, 21న సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు.

**జంగారెడ్డిగూడెంలో..** జంగారెడ్డిగూడెం: మున్సిపల్ కార్యాలయం లో చైర్‌పర్సన్ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఒకటి నుంచి 8 వార్డుల వరకు పాత మున్సిపల్ కార్యాలయం వద్ద కేసనపల్లి స్వర్ణ వార్డు కార్యాలయంలో, తొమ్మిది నుంచి 16 వార్డులకు జడ్పీ బాలికల హైస్కూల్‌లో, 17 నుంచి 24 వరకు జడ్పీ బాలుర హైస్కూల్‌లో, 25 నుంచి 32 వార్డుల వరకు డిగ్రీ కళాశాలలో స్వీకరించను న్నట్టు కమిషనర్ కేవీ రమణ తెలిపారు.

**నూజివీడులో..** నూజివీడు టౌన్: నూజివీడు మున్సి పల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు తొమ్మిది కౌంటర్లను ఏర్పాటు చేశారు. మరో కౌంటర్ చైర్మన్ అభ్యర్థి నామి నేషన్లకు ఏర్పాటు చేశారు.ఎన్నికల అధి కారులకు గురు వారం శిక్షణ నిర్వ హించారు. సబ్ కలె క్టర్ వినూత్న మున్సి పల్ కార్యాలయ ప్రాంగణం లో నామినేష్ల స్వీకరణ ఏర్పాట్లను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

**జన సేనకు ఏలూరు మేయర్ స్థానం!** పొత్తులో భాగంగా ఏలూరు కార్పొ రేషన్ మేయర్ సీటును జనసేనకు కేటా యించడంతో అభ్యర్థిగా రెడ్డి అప్పల నాయుడు పోటీ చేయడం ఖరారైంది. మరోవైపు ఏలూరు టీడీపీ వర్గాల్లో ఆందోళన మొదలైంది. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం రాత్రి పార్టీ నేతలు కంప్యూటర్ ప్రసాద్, చోడే వెంకట రత్నం, రెడ్డి నాగరాజు, ఎస్ఎం ఆర్ పెద బాబు, మారం హనుమంతరావు తదితరు లు మాట్లాడుతూ టీడీపీ అధిష్ఠానం పునః పరిశీలించి మేయర్ సీటును టీడీ పీకి కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో శుక్రవారం పార్టీ జిల్లా అధ్య క్షుడు, ఎమ్మెల్యే బడేటి చంటిని కలిసి టీడీపీ నగర కార్యవర్గం, 62 డివిజన్ల ఇన్ ఛార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జులు మూకుమ్మడి రాజీనామాలు సమర్పిస్తామని హెచ్చరిం చారు. మరోవైపు నగరంలో 15 చోట్ల జన సేన అభ్యర్థులను బరిలో దింపేందుకు పావులు కదిపింది. అప్పలనాయుడు శనివారం నామినేషన్ దాఖలు చేయనున్నారు.

# ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం:

**ఖైరతాబాద్ ఉపఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందన్న కవిత**

**రేవంత్ పాలన పక్కన పెట్టేశారని విమర్శ**

**రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉంటామని వెల్లడి**

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికపై స్పందించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని, బలమైన అభ్యర్థిని నిలబెడతామని ఆమె ప్రకటించారు. దసరా రోజున ఒక ఎమ్మెల్సీ అభ్యర్థిని కూడా ప్రకటిస్తామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టి రాజకీయాలపైనే దృష్టి సారిస్తున్నారని కవిత ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు కరవుతో అల్లాడుతుంటే, ముఖ్యమంత్రి మాత్రం గోవా, ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉండి క్షేత్రస్థాయిలో పోరాడతామని కవిత స్పష్టం చేశారు. నవంబర్ చివరి వరకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పనులను వెంటనే పునరుద్ధరించి పూర్తి చేయాలని కోరారు. పారదర్శకత కోసం ఇకపై అన్ని ఎన్నికలను ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్లోబల్ సమ్మిట్‌పై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయకపోతే అడ్డుకుంటామని హెచ్చరించారు.

## రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం

"ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్

ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి జనసేన సిద్ధమైంది. ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శుక్రవారం హైదరాబాదులో ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ గడల శ్రీనివాసరావుకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రచారానికి సంబంధించి ఆయనకు పలు సూచనలు చేశారు. ఈ 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' కేవలం ఎన్నికల ప్రచార వాహనంగానే పరిమితం కాకూడదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేసే ఒక ప్రజాసేవా వేదికగా ఇది కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. హైదరాబాదులోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

# తెలంగాణకు మరో దిగ్గజ కంపెనీ.. సీఎం రేవంత్‌తో హ్యుందాయ్ ప్రతినిధుల భేటీ

**సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమైన హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ప్రతినిధులు**

**జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్లతో ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన**

**ఈ కేంద్రం ద్వారా 4,275 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడి**

**అనుమతులు వేగంగా జారీ చేయాలని అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్**

**తెలంగాణలో కార్ల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని హ్యుందాయ్‌కు ఆహ్వానం**

తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి రాబోతోంది. ప్రపంచ ప్రసిద్ధ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా, రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్ల వ్యయంతో అత్యాధునిక రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ద్వారా సుమారు 4,275 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. శుక్రవారం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ ఎండీ చాంగ్యో చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ భేటీ సందర్భంగా తమ పెట్టుబడి ప్రణాళికలను సీఎంకు వారు వివరించారు. జహీరాబాద్‌లో నెలకొల్పబోయే ఆర్ అండ్ డీ కేంద్రం స్వరూపం, దాని ద్వారా లభించే ఉపాధి కల్పన వివరాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలియజేశారు.హ్యుందాయ్ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వెంటనే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో, తెలంగాణలో కార్ల తయారీ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయాలని హ్యుందాయ్ ప్రతినిధులను ఆయన ఆహ్వానించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అత్యంత అనుకూల వాతావరణం ఉందని, ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ భారీ పెట్టుబడితో జహీరాబాద్ ప్రాంతం ఆటోమొబైల్ హబ్‌గా మరింత అభివృద్ధి చెందనుండటంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

## సికింద్రాబాద్‌లో కేజేఆర్ గార్డెన్ కూల్చివేత

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో దశాబ్దాలుగా వివాదాస్పదంగా ఉన్న కేజేఆర్ గార్డెన్‌ను కంటోన్మెంట్ బోర్డు అధికారులు శుక్రవారం పూర్తిగా నేలమట్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మించి, ఫంక్షన్ హాల్‌గా నిర్వహిస్తున్న ఈ కట్టడంపై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. న్యాయస్థాన ఆదేశాల మేరకు ఈ కూల్చివేత ప్రక్రియను చేపట్టారు. శుక్రవారం ఉదయం కంటోన్మెంట్ అధికారులు భారీ పోలీసు బందోబస్తు నడుమ యంత్రాలతో కేజేఆర్ గార్డెన్ వద్దకు చేరుకున్నారు. అనంతరం ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని కూల్చివేయడం ప్రారంభించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు. కొద్ది గంటల వ్యవధిలోనే ఆ నిర్మాణాన్ని అధికారులు పూర్తిగా నేలమట్టం చేశారు.సదరు స్థలంలో అక్రమ నిర్మాణంపై 1996 నుంచి న్యాయస్థానంలో వివాదం కొనసాగుతోంది. కేజేఆర్ గార్డెన్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా ఫంక్షన్ హాల్‌ను నిర్మించి, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తోందని కంటోన్మెంట్ బోర్డు గతంలోనే స్పష్టం చేసింది. దీనిపై సుదీర్ఘకాలం పాటు సాగిన న్యాయపోరాటంలో ఇటీవలే న్యాయస్థానం కంటోన్మెంట్ బోర్డుకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. కోర్టు ఆదేశాల మేరకు కంటోన్మెంట్ అధికారులు ఈ కూల్చివేత ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో దాదాపు రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న వివాదానికి తెరపడినట్లయింది. అధికారులు ఈ చర్యతో కంటోన్మెంట్ ప్రాంతంలోని ఇతర అక్రమ నిర్మాణదారులకు గట్టి హెచ్చరికలు జారీ చేసినట్లయింది.




# అప్పుల చర్చతో కాంగ్రెస్‌కు కొత్త చిక్కులు

**అధిష్ఠానం దృష్టికి అంతర్గత విభేదాలు!** రాష్ట్ర కాంగ్రెస్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు, మంత్రుల మధ్య సమన్వయ సమస్యలు, ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు పార్టీ నేతలు స్పందిస్తున్న తీరుపై ఏఐసీసీ స్థాయిలో ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఏఐసీసీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ రాష్ట్రానికి చెందిన కొందరు ముఖ్య నేతలతో మాట్లాడి తాజా రాజకీయ పరిస్థితులపై వివరాలు సేకరించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అప్పుల అంశంపై మంత్రులు విసిరిన సవాళ్లు, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు పార్టీపై ఎలాంటి ప్రభావం చూపాయన్న అంశంపైనా సమీక్ష జరిగినట్లు తెలుస్తోంది. రాష్ట్ర రాజకీయ పరిస్థితులను ఎప్పటికప్పుడు అధిష్ఠానానికి చేరవేస్తున్న సీనియర్ నేతలతో సంప్రదింపులు జరిపినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వ విధానాలను సమర్థించడంలో, మంత్రుల ప్రకటనలకు వివరణ ఇవ్వడంలో పార్టీ శ్రేణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్న అభిప్రాయాలు అధిష్ఠానం దృష్టికి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా బీసీ, దళిత సామాజిక వర్గాలకు చెందిన కొందరు సీనియర్ నేతలు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే, ఈ సంప్రదింపుల వివరాలు, అధిష్ఠానం నుంచి వచ్చినట్లు చెబుతున్న సూచనలపై అధికారిక ధ్రువీకరణ వెలువడాల్సి ఉంది.

**అప్పుల చర్చతో కాంగ్రెస్‌కు ఇబ్బందులు!** తెలంగాణ అప్పుల అంశం కొంతకాలంగా అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రధాన రాజకీయ అస్త్రంగా మారింది. గత ప్రభుత్వ ఆర్థిక విధానాలను ప్రశ్నిస్తూ బీఆర్ఎస్‌ను ఇరుకున పెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుండగా, ప్రస్తుత ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి, అప్పుల నిర్వహణ, హామీల అమలు వంటి అంశాలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ ఎదురుదాడికి దిగుతోంది. ఈ క్రమంలో అప్పులపై బహిరంగ చర్చకు సిద్ధమంటూ ఇరుపక్షాల నేతలు సవాళ్లు, ప్రతిసవాళ్లు విసరడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రజలకు ఆర్థిక పరిస్థితిపై స్పష్టమైన వివరాలు అందించాల్సిన చర్చ క్రమంగా వ్యక్తిగత సవాళ్లు, రాజకీయ ప్రతిష్ఠకు సంబంధించిన వ్యవహారంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మంత్రుల ప్రకటనలు ప్రతిపక్షానికి కొత్త అవకాశాలను కల్పించాయన్న విశ్లేషణలూ వెలువడుతున్నాయి.అప్పులపై వాస్తవాలను అధికారిక గణాంకాలు, బడ్జెట్ పత్రాలు, శ్వేతపత్రాలు, శాసనసభ చర్చల ద్వారా ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇలాంటి అంశాలను బహిరంగ సవాళ్లు, మీడియా సమావేశాలు, పరస్పర ఆరోపణలకే పరిమితం చేస్తే ఆశించిన రాజకీయ ప్రయోజనం దక్కకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**రేవంత్ వ్యూహం ఒకవైపు.. మంత్రుల దూకుడు మరోవైపు!** ప్రత్యర్థులను రాజకీయంగా ఇరుకున పెట్టేందుకు శాసనసభ వేదికకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాధాన్యం ఇస్తారని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. అధికారిక సమాచారం, ప్రభుత్వ రికార్డులు, బడ్జెట్ లెక్కలు, సభా చర్చల ఆధారంగా ప్రతిపక్షాల వాదనలకు సమాధానం ఇవ్వడం ద్వారా రాజకీయంగా పైచేయి సాధించవచ్చన్నది ఈ వ్యూహంలోని ప్రధాన ఉద్దేశంగా వివరిస్తున్నాయి. అయితే, ముఖ్యమంత్రి రాజకీయంగా విసిరే సవాళ్లను కొందరు మంత్రులు వ్యక్తిగత ప్రతిష్ఠకు సంబంధించిన అంశాలుగా తీసుకుంటూ బహిరంగంగా ప్రతిస్పందిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ముఖ్యమంత్రి అనుసరించాలనుకుంటున్న వ్యూహానికి, మంత్రుల కార్యాచరణకు మధ్య అంతరం పెరుగుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏ అంశాన్ని ఎక్కడ ప్రస్తావించాలి, ఏ వేదికపై చర్చకు తీసుకెళ్లాలి అన్నదానిపై స్పష్టమైన వ్యూహంతో ముందుకెళ్లాల్సిన సమయంలో మంత్రులు తక్షణ రాజకీయ ప్రతిస్పందనలకు ప్రాధాన్యం ఇస్తున్నారన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ భిన్న ధోరణులు కొన్ని సందర్భాల్లో అధికార పార్టీకి ఇబ్బందులు సృష్టిస్తున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**తాజా సవాళ్లతో బీఆర్ఎస్‌కు అవకాశం?** ఇటీవల మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన సవాళ్లు, వాటిపై బీఆర్ఎస్ నేతలు స్పందించిన తీరు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అప్పుల అంశంపై కాంగ్రెస్ ఆశించిన రీతిలో ప్రతిపక్షాన్ని ఇరుకున పెట్టలేకపోగా, చర్చను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నించిందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.అయితే, ఈ పరిణామాలను బీఆర్ఎస్ సాధించిన నిర్దిష్ట రాజకీయ విజయంగా నిర్ధారించాలంటే ప్రజాభిప్రాయం, చర్చలో వెలుగుచూసిన వాస్తవాలు, తదనంతర రాజకీయ పరిణామాలను పరిశీలించాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి మాత్రం అప్పులపై సాగిన బహిరంగ సవాళ్లు కాంగ్రెస్ వ్యూహానికి ఆశించిన స్థాయిలో ఉపయోగపడలేదన్న అభిప్రాయం అధికార పార్టీ వర్గాల్లోనూ వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది.గత ప్రభుత్వ ఆర్థిక విధానాలపై విమర్శలతో ప్రారంభమైన చర్చ, ప్రస్తుత ప్రభుత్వ ఆర్థిక నిర్వహణపై వివరణ ఇవ్వాల్సిన పరిస్థితికి మారడం కాంగ్రెస్‌కు వ్యూహాత్మకంగా ఇబ్బందికరంగా మారిందన్నది రాజకీయ పరిశీలకుల విశ్లేషణ.

**ప్రతిపక్ష వ్యూహాలకు సమన్వయమే సమాధానమా?** అధికార పార్టీని నిరంతరం వివరణలు ఇచ్చే స్థితిలో ఉంచడం ప్రతిపక్షాల రాజకీయ వ్యూహాల్లో ఒక భాగం. ఒక అంశంపై అధికార పార్టీ స్పందిస్తుండగానే మరో అంశాన్ని తెరపైకి తీసుకురావడం, మంత్రుల ప్రకటనల్లోని వైరుధ్యాలను ప్రస్తావించడం, వ్యక్తిగత సవాళ్లను రాజకీయ ప్రచారంగా మార్చడం వంటి చర్యలకు బీఆర్ఎస్ ప్రాధాన్యం ఇవ్వవచ్చని కాంగ్రెస్ నేతలు అంచనా వేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అధికార పార్టీ తక్షణ రాజకీయ ప్రతిస్పందనలకే పరిమితమైతే పాలనకు సంబంధించిన ప్రధాన అంశాలు వెనుకబడే ప్రమాదం ఉంది. ఎన్నికల హామీల అమలు, సంక్షేమ పథకాలు, రైతుల సమస్యలు, నిరుద్యోగం, సాగునీరు, విద్యుత్ వంటి అంశాలపై ప్రభుత్వ పురోగతిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన సమయంలో రోజువారీ వివాదాలే రాజకీయ చర్చను ఆక్రమిస్తే దీర్ఘకాలికంగా నష్టం కలగవచ్చన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రతిపక్షం చేసే ప్రతి విమర్శకు ఒక్కో మంత్రి విడివిడిగా సమాధానం ఇవ్వడం కంటే, ప్రభుత్వ విధానానికి అనుగుణంగా ఒకే స్పష్టమైన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ముఖ్యమని పార్టీ సీనియర్లు సూచిస్తున్నట్లు సమాచారం.

**టీపీసీసీ దిద్దుబాటు చర్యలు చేపట్టేనా?** మంత్రులు, పార్టీ ముఖ్య నేతల వ్యాఖ్యల్లో సమన్వయం పెంచడం, కీలక ఆర్థిక అంశాలపై అధికారిక సమాచారంతో స్పందించడం, ప్రభుత్వ విధానాలకు భిన్నమైన ప్రకటనలు వెలువడకుండా జాగ్రత్తలు తీసుకోవడంపై టీపీసీసీ దృష్టి సారించాల్సిన అవసరం కనిపిస్తోంది. ప్రతిపక్షాలు సవాళ్లు విసిరినప్పుడు ఎవరు స్పందించాలి? ఏ స్థాయిలో స్పందించాలి? ఏ అంశాలను శాసనసభ వేదికపై చర్చించాలి? అనే విషయాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అవసరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధిష్ఠానం నుంచి సమన్వయాన్ని మెరుగుపరచాలన్న సూచనలు వచ్చినట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, వాటిని అమలు చేసే బాధ్యత రాష్ట్ర నాయకత్వంపైనే ఉంటుంది. ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, పార్టీ సీనియర్ నేతల మధ్య సమన్వయం పెరిగితేనే ప్రభుత్వ విధానాలను సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం సాధ్యమవుతుంది.

**భవిష్యత్తు రాజకీయాలకు ఇప్పటి నుంచే పరీక్ష!** తెలంగాణలో కాంగ్రెస్ పాలనకు ప్రజామోదాన్ని పెంచుకోవాలంటే ప్రతిపక్షాలపై రాజకీయ పైచేయి సాధించడం ఒక్కటే సరిపోదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ పనితీరు, హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ నేతల మధ్య ఐక్యత కూడా కీలక పాత్ర పోషిస్తాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. మంత్రుల ప్రకటనలతో తలెత్తే వివాదాలను సమర్థించుకోవడంలోనే పార్టీ సమయం, శక్తి వెచ్చించాల్సి వస్తే పాలనకు సంబంధించిన అంశాలపై దృష్టి తగ్గే ప్రమాదం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీర్ఘకాలిక రాజకీయ లక్ష్యాలకు అనుగుణంగా మంత్రులు, పార్టీ యంత్రాంగం ఒకే దిశలో పనిచేయాల్సిన అవసరం కనిపిస్తోంది. ప్రతిపక్షం విసిరే సవాళ్లకు తక్షణ రాజకీయ స్పందన ఇవ్వడం కంటే, అధికారిక సమాచారం ఆధారంగా సమన్వయంతో వ్యవహరించడం ద్వారా ప్రజల్లో విశ్వసనీయతను పెంచుకోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అప్పుల అంశంపై మొదలైన రాజకీయ పోరు కాంగ్రెస్‌లోని సమన్వయ సమస్యలపై చర్చకు దారితీసింది. ఈ పరిస్థితులను సకాలంలో చక్కదిద్దుకుని, ప్రభుత్వ వ్యూహానికి అనుగుణంగా పార్టీ నాయకత్వాన్ని సమన్వయం చేయగలిగితేనే కాంగ్రెస్ తన రాజకీయ లక్ష్యాల దిశగా ముందుకు సాగేందుకు అవకాశం ఉంటుంది. లేనిపక్షంలో ప్రతిపక్షాల విమర్శలతోపాటు, సొంత పార్టీ నేతల పరస్పర విరుద్ధ ప్రకటనలు కూడా అధికార పార్టీకి రాజకీయంగా సవాళ్లు విసిరే అవకాశం ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

## స్థానిక ఎన్నికలకు టీడీపీ అభ్యర్థుల ప్రకటన

**ఏడు కార్పొరేషన్ల మేయర్ అభ్యర్థుల ఖరారు**

**29 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు చైర్మన్ అభ్యర్థుల ఎంపిక**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ కీలక ప్రకటన చేసింది. ఏడు మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ అభ్యర్థులతో పాటు 29 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు చైర్మన్ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. మేయర్, చైర్మన్ పదవులకు పోటీపడే అభ్యర్థుల ఎంపికను పూర్తి చేస్తూ పార్టీ జాబితాను విడుదల చేసింది.

**టీడీపీ మేయర్ అభ్యర్థులు** చిత్తూరు కటారి హేమలత, కడప నెల్లటూరి సువర్ణ
కర్నూలు విజయ ప్రత్యూష , నెల్లూరు పి. రూప్ కుమార్
తిరుపతి మన్నెం శ్రీనివాసప్రసాద్, విశాఖపట్నం ముక్క శ్రావణి
విజయనగరం అవనపు భార్గవి29 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు చైర్మన్ అభ్యర్థులు ఆళ్లగడ్డ అనీషా షేక్ అద్దంకి కాకాని అశోక్ ఆదోని నాగమణి ఆత్మకూరు (నంద్యాల) డా. గోవిందరాజులు బద్వేలు సోమశిల దివ్య తేజ
బొబ్బిలి రాంబార్కి రేణుకాదేవి స్వప్న దాచేపల్లి తంగెళ్ల శ్రీనివాసరావు
ధర్మవరం పరిశె సుధాకర్

## శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా "ఫైనల్ హ్యాకథాన్ పోటీలు2026"



**నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 16 . (నంది పత్రిక ):**శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్), నంద్యాలలో "ఫైనల్ హ్యాకథాన్ పోటీలు2026" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఆర్ఈసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు, వినూత్న ఆలోచనలు మరియు సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, విద్యార్థులు తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పరిశ్రమలు మరియు సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు వినూత్నమైన పరిష్కారాలను రూపొందించాలని సూచించారు. హ్యాకథాన్ పోటీలు విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు, వారిని భవిష్యత్తులో ఉత్తమ ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దేందుకు దోహదపడతాయని తెలిపారు.హ్యాకథాన్ సమన్వయకర్త డా. ఎన్. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, అంతర్గత హ్యాకథాన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి బృందాలు ఫైనల్ హ్యాకథాన్ పోటీల్లో తమ వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించాయని తెలిపారు. విద్యార్థులు తమ ఆలోచనలను ఆచరణాత్మక సాంకేతిక పరిష్కారాలుగా అభివృద్ధి చేసి, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణల దిశగా కృషి చేయాలని సూచించారు.ఈ ఫైనల్ హ్యాకథాన్ పోటీల్లో స్మార్ట్ ఆటోమేషన్, రోబోటిక్స్, వ్యవసాయం, ఆరోగ్య సాంకేతికత, సుస్థిర ఇంధనం, సైబర్ భద్రత, స్మార్ట్ విద్య, విపత్తు నిర్వహణ తదితర రంగాలకు సంబంధించిన వినూత్న ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థి బృందాలు తమ ప్రాజెక్టుల పనితీరు, ఉపయోగాలు మరియు సాంకేతిక ప్రత్యేకతలను వివరించి, తమ ప్రతిభను చాటుకున్నారు.పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి మూడు విజేత బృందాలకు నగదు బహుమతులను అందజేశారు. ఈ బహుమతులు విద్యార్థులను మరింత ప్రోత్సహించడంతో పాటు, నూతన ఆవిష్కరణలు మరియు పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. విజేత బృందాలను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ మరియు అధ్యాపకులు అభినందించారు.



## సరస్వతి దేవిగా శ్రీ అంకాల పరమేశ్వరి అమ్మవారు





**మహానంది అక్టోబర్ 16 (నంది పత్రిక):-** మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో శ్రీ అంకాల పరమేశ్వరి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల 6వ రోజైన శుక్రవారం, మూలా నక్షత్రం పురస్కరించుకుని అమ్మవారు శ్రీ సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.అర్చకులు రామ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ ప్రత్యేక అభిషేకార్చనలు, చండీ హోమాలు, చండీ పారాయణం, కుంకుమార్చన, పల్లకి సేవ,మహా మంగళ హారతి పూజలు ఘనంగా నిర్వహించారు.జ్ఞానప్రదాయిని అయిన సరస్వతి రూపంలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.పూజా కార్యక్రమ దాతలుగా లక్కాకుల నారాయణ, లక్కాకుల భాస్కర్, వెంకటేశ్వరి దంపతులు వ్యవహరించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించిన ... జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ



స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా గూడూరు మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణం ఇండోర్ భవనంలో ఏర్పాటు చేస్తున్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి , జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ , జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పరిశీలించారు.ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సమీక్షించి, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు.

# ఆదోనిలో బీజేపీకి షాక్

### వైఎస్సార్‌సీపీలో చేరిన కీలక నేతలు, 100 కుటుంబాలు



**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** ఆదోని పట్టణంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బీజేపీకి చెందిన ప్రముఖ నాయకులు కళ్ళుపోతుల సురేష్, గోనబావి గోవిందుతో పాటు హనుమాన్ నగర్‌కు చెందిన బోయ వీరేష్‌లు ఆ పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరితో పాటు సుమారు 100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. పార్టీలో చేరిన నేతలు, కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే వై. సాయిప్రసాద్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అందిస్తున్న ప్రజా సంక్షేమం, సిద్ధాంతాలను నమ్మి పార్టీలోకి వచ్చే ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని స్పష్టం చేశారు.

## నంది సదనం నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం అందించిన ప్రముఖ వైద్య దంపతులు



**మహానంది అక్టోబర్ 16 (నంది పత్రిక):-** మహానంది క్షేత్రంలో భక్తుల వసతి సౌకర్యార్థం నిర్మిస్తున్న 'నంది సదనం' విశ్రాంతి భవనానికి దాతలు విరాళం అందించారు. ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ ఎం. మురళీకృష్ణ,స్త్రీ వ్యాధి నిపుణులు డాక్టర్ తనూజ దంపతులు ఒక డీలక్స్ రూమ్ నిర్మాణం కోసం రూ. 10 లక్షల రూపాయల విరాళాన్ని ఈవో ఎన్. శ్రీనివాసరెడ్డికి భక్తితో అందజేశారు.ఈ కార్యక్రమంలో దాతల సోదరులు డాక్టర్ ఎం. జయరామకృష్ణ,డాక్టర్ నిత్య దంపతులు పాల్గొన్నారు.మహానంది క్షేత్ర అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల మెరుగుదలకు ఉదారంగా ముందుకు వచ్చిన వైద్య దంపతులను ఆలయ ఈవో శాలువాతో సత్కరించి,అభినందనలు తెలియజేశారు. భక్తుల వసతి కొరకు దాతలు అందిస్తున్న ఈ సహకారం ఎంతో అభినందనీయమన్నారు

# ఎమ్మెల్యే బుడ్డా ఆదేశాలతో అభ్యర్థుల ఎంపిక పై టీడీపీ కసరత్తు







### ఆన్ లైనులో జనసేన దరఖాస్తులు

**బండి ఆత్మకూరు నంది పత్రిక అక్టోబర్ 16:** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులను ఎంపిక చేసేందుకు టిడిపి కసరత్తు ప్రారంభించింది. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాలతో శుక్రవారం టిడిపి నాయకులు బండి ఆత్మకూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. అన్ని గ్రామాల నుండి కార్యకర్తలను నాయకులను పార్టీ కార్యాలయానికి రప్పించుకొని వారి అభిప్రాయాలను తెలుసుకుని ప్రయత్నం చేస్తున్నారు. ఎంపీటీసీ స్థానాలలో పోటీ చేసేందుకు ఉత్సాహంగా ఉన్న కార్యకర్తలు నాయకుల పేర్లను సేకరించే పనికి పూనుకున్నారు. బండి ఆత్మకూరు మండల పరిషత్ అధ్యక్ష స్థానం బలహీన వర్గాలకు చెందిన మహిళకు కేటాయించడం జరిగింది. కడమల కాల్వ, సంత జుటూరు, లింగాపురం ఎంపీటీసీ స్థానాలు బీసీ మహిళలకు కేటాయించారు. ఈ మూడు గ్రామాలలో నాయకులు పోటీ చేసేందుకు ఉత్సాహం కనపరుస్తున్నట్లుగా తెలుస్తోంది. పార్టీ నాయకులు నాయకుల నుండి సేకరించిన సమాచారాన్ని ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ రెడ్డి కి సమర్పించనున్నారు. శనివారం మధ్యాహ్నం నాటికి మండల పరిషత్ అధ్యక్ష పదవికి ఎమ్మెల్యే ఎంపిక చేయనున్నట్లుగా తెలుస్తోంది. జడ్పీటిసి స్థానానికి పోటీ చేసేందుకు పార్టీకి సంబంధించి ఆరుగురు పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లుగా సమాచారం. జెడ్పీటిసి స్థానానికి సంబంధించి అభ్యర్థి ఎంపిక కూడా శనివారం తేలనున్నది . పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు జెడ్పీటిసి స్థానానికి భారతీయ జనతా పార్టీ తరఫున పోటీ చేస్తానని జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు బిజ్జం సుబ్బారెడ్డి రెండు రోజుల క్రితమే ఈ విషయంపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిని బిజ్జం కలిసి తనకు సహకారం అందివ్వాలని కోరనున్నట్లుగా సమాచారం.

గ్రామపంచాయతీలకు సంబంధించి సర్పంచి పదవులకు పోటీ చేసేందుకు గాను చాలామంది నాయకులు పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లుగా తెలుస్తోంది.

**జనసేన పిలుపుతో పార్టీ కార్యకర్తలు బిజీ** ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసే విషయంలో ఉత్సాహంగా ఉన్న యువకులు దరఖాస్తులు పంపుకోవాలని జనసేన పార్టీ మంగళగిరి కార్యాలయం నుండి అయిదు రోజులు క్రితమే కార్యకర్తలకు ఆదేశాలు అందాయి. పోటీ చేసే అభ్యర్థులు ఆన్లైన్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని జనసేన పార్టీ ఆదేశించడంతో, తమ పేర్లను ఆన్లైన్లో నమోదు చేసుకునే విషయంలో జనసేన నాయకులు బిజీగా ఉన్నారు. శుక్రవారం బండి ఆత్మకూరు మండలంలోని జనసేన సైనికులకు కూడా మంగళగిరి పార్టీ ఆఫీసు నుండి ఆదేశాలు వెలువడ్డాయి. మండలంలోని జనసేన నాయకులు కూడా తమ పేర్లను నమోదు చేసుకోవడంలో బిజీగా ఉన్నారు.

# దోపిడి దొంగల అరెస్టు నగదు స్వాధీనం

### 24గంటల్లోనే కేసును చేదించిన పోలీసులు

### సి ఐ, ఎస్సై ని అభినందించిన ఏ ఎస్పి




**కోవెలకుంట్ల అక్టోబర్ 16నందిపత్రిక** భూమి రిజిస్ట్రేషన్ కోసం నగదు తో కోవెల కుంట్ల సబ్ రిజిస్టార్ కు వస్తున్న రైతు మోటార్ బైకను అనుసరించిన దొంగలు గుళ్ళదుర్తి వద్ద నిర్మాణంలో ఉన్న టోల్ గేట్ సమీపంలో బైక్ స్లో అవ్వగానే నగదు బ్యాగ్ను లాక్కొని పరారయ్యారు. అయితే నగదు దోచుకెళ్లిన నిందితులను కోవెలకుంట్ల పోలీసులు 24 గంటల్లోనే కేసు ను చెందించి అరెస్టు చేశారు. ఏ ఎస్పి ఖాదర్ బాషా మీడియా సమావేశంలో తెలిపిన వివరాల మేరకు ఉయ్యాలవాడ మండలం పెద్దయమ్మనూరు గ్రామానికి చెందిన వ్యక్తి శుక్రవారం భూమి కొనుగోలు రిజిస్టేషన్ కోసం రూ. 7.05 లక్షల నగదుతో కోవెలకుంట్ల సబ్ రిజిస్టార్ కార్యాలయానికి వస్తుండగా వారిని నలుగురు దొంగలు అనుసరించి గుళ్ళదుర్తి టోల్ గేట్ సమీపంలోకి రాగానే వారి బ్యాగ్ ను లాక్కొని పరారయ్యారు. ఈ పరిస్థితుల్లో లక్ష్మి దేవి స్థానిక పోలీసులకు పిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం తో కేసును చెందించి వారిని అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు.నిందితుల నుంచి రూ.6.53 లక్షల విలువైన నగదు సొత్తు స్వాధీనం చేసుకొని నాలుగు సెల్‌ఫోన్లు, పల్సర్ బైక్, హెల్మెట్ స్వాధీనం చేసుకున్నారు.కేసును 24 గంటల్లో చెందించిన సీఐ హనుమంత నాయక్, ఎస్సై మల్లికార్జున రెడ్డి ని ఏ ఎస్పి అభినందించారు.

## బేతంచెర్ల నగర పంచాయిలో సిపిఎం అభ్యర్థులుగా 2 నామినేశన్లు.



**బేతంచెర్ల అక్టోబర్ 16 ( నంది పత్రిక.).** బేతంచెర్ల నగర పంచాయతీఎన్నికలకు సంభందించి సిపిఎం పార్టీ అభ్యర్థులుగా 23వ వార్డు( బీసీ జనరల్) కౌన్సిల ర్ గా వి. సుబ్బారాయుడు, 14వ వార్డు (ఎస్టీ జనరల్ కౌన్సిలర్) అభ్యర్థిగా వై. ఎల్లయ్య సిపిఎం పార్టీ అభ్యర్థులుగా శుక్రవారం నాడు నామినేషన్లు వేయడం జరిగింది. నామినేషన్లు స్వీకరించడానికి మొదటి రోజు శుక్రవారం నాడు రెండు సిపిఎం పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు తప్ప, మిగతా పార్టీల నుండి ఎవరు కూడా నామినేషన్లు వేయక పోవడం గమనార్హం.



# మున్సిపల్ అధికారుల తీరుపై సీపీఎం శ్రీకాంత్ ఆగ్రహం

**డోన్ నంది పత్రిక అక్టోబర్ 16**డోన్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు నో డ్యూ సర్టిఫికెట్లు మంజూరు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ ఆరోపించారు. రెండు రోజులకుపైగా ముందుగానే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సైతం సర్టిఫికెట్లు జారీ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు.శుక్రవారం ప్రారంభమైన నామినేషన్ ప్రక్రియలో భాగంగా నామినేషన్లు దాఖలు చేసేందుకు మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన పలువురు అభ్యర్థులు నో డ్యూ సర్టిఫికెట్లు అందకపోవడంతో నామినేషన్లు వేయకుండానే వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ, అభ్యర్థులకు అవసరమైన ధ్రువపత్రాలను సకాలంలో అందించకపోవడం వల్ల నామినేషన్ల దాఖలుకు ఆటంకం కలుగుతోందని విమర్శించారు. కూటమి పార్టీలకు చెందిన అభ్యర్థుల పనులను వేగంగా పూర్తి చేస్తూ, ప్రతిపక్ష పార్టీలతో పాటు సీపీఎం అభ్యర్థుల విషయంలో వివక్ష చూపుతున్నారని శ్రీకాంత్ ఆరోపించారు. అధికారుల వ్యవహారశైలిపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ప్రతి అభ్యర్థికి పార్టీతో సంబంధం లేకుండా సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు.ఉదయం నుంచి నో డ్యూ సర్టిఫికెట్ల కోసం అభ్యర్థులు, ప్రజలు కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నప్పటికీ అధికారులు సమస్యను పరిష్కరించడంలో చొరవ చూపడం లేదని ఆయన ఆరోపించారు. అభ్యర్థుల ఇబ్బందులను పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి పరిణామాలు ప్రజలకు ఎన్నికల వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నామినేషన్ల దాఖలుకు అవసరమైన నో డ్యూ సర్టిఫికెట్లను తక్షణమే జారీ చేసి, ఎన్నికల ప్రక్రియలో అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించాలని శ్రీకాంత్ మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు.



# ఎన్నికల భద్రతా ఏర్పాట్ల పై క్షేత్రస్థాయి పరిశీలన చేసిన ...
# కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్





**- ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి**

**- పోలీసు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి**

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** ఎన్నికల భద్రతా ఏర్పాట్లలో భాగంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ శుక్రవారం ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని పలు కీలక ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ముందుగా ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని, అనంతరం బనవాసి సమీపంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మిగనూరు పట్టణంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రంతో పాటు వెంకటాపురం, ఆది ఆంధ్ర పాఠశాలలను పరిశీలించారు. అదేవిధంగా ఎమ్మిగనూరు గ్రామీణ పరిధిలోని కడిమెట్ల, ఎర్రకోట వంటి సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలను సందర్శించి శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎమ్మిగనూరు డీఎస్పీ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఎన్నికల భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణ, సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించారు.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా ప్రణాళికను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సీఐ చిరంజీవి, టౌన్ సీఐ కంబగిరి రాముడు, టౌన్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, నందవరం ఎస్ఐ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

## లాడ్జిల యజమానులు నిబంధనలు పాటించాలి : ఎస్ ఐ శివాంజల్



**మహానంది అక్టోబర్ 16 (నంది పత్రిక):-** లాడ్జిల యజమానులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ ఐ ఎల్.శివాంజల్ పేర్కొన్నారు.మహానంది పోలీస్ స్టేషన్లో మహానంది లోని లాడ్జిల యజమానులతో శుక్రవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.మైనర్లకు రూములు ఇవ్వరాదన్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో రూముల కోసం వచ్చే వారివి తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకొని వారి వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.లాడ్జిల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వర్లు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నంద్యాలలో ఎస్‌డీపీఐ నుంచి టీడీపీ లోకి భారీ చేరికలు

**టీడీపీ కండువా కప్పుకున్న ఎస్‌డీపీఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి మహబూబ్ జీలాన్**



**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 16 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలో సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) నుంచి పలువురు నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎస్‌డీపీఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి మహబూబ్ జీలాన్ తెలుగుదేశం పార్టీలో చేరగా, మంత్రివర్యులు ఎన్‌ఎండి ఫరూక్ మరియు టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్ నంద్యాల అసెంబ్లీ పార్టీ కార్యాలయంలో ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహబూబ్ జీలాన్ మాట్లాడుతూ, రాష్ట్ర మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ నంద్యాల నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు.ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషికి మద్దతుగా నిలుస్తూ, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.ఈ చేరికతో నంద్యాలలో తెలుగుదేశం పార్టీకి మరింత బలం చేకూరుతుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ మునియర్ ఖలీల్ పాల్గొన్నారు





# పిఎండిఎస్, ప్రకృతి సాగు క్షేత్రాల పరిశీలన..





**మొక్కలు భూమిలోని సూక్ష్మజీవులకు ఆహారాన్నిచ్చి తిరిగి పోషకాలు పొందుతాయి:ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్ కుమార్ ఐఏఎస్ (రిటైర్డ్).. రూ. 60/-లకే కిచెన్ గార్డెన్ కిట్లతో పోషకాహార భద్రత: డీఆర్‌డీఏ పీడీ వై.బి. శ్రీధర్ రెడ్డి..**

**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 16 ( నంది పత్రిక )** ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపిసిఎన్ఎఫ్), రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ (ఈవిసి) టి. విజయ్ కుమార్ ఐఏఎస్ (రిటైర్డ్) శుక్రవారం నంద్యాల జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. తొలుత డీఆర్‌డీఏ పీడీ వై.బి. శ్రీధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నిరుపేద కుటుంబాలకు అందిస్తున్న కిచెన్ గార్డెన్ కిట్ల పురోగతిని వివరించగా ఈవిసి అభినందించారు. అనంతరం కాపులపల్లెలో రైతు అరికట్ల శ్రీనివాస రెడ్డి పొలంలో 7 ఎకరాల సీతాఫలం తోటలోని పిఎండిఎస్, 2 ఎకరాల 5-లేయర్ మోడల్‌ను పరిశీలించారు. ఆ తర్వాత అల్లూరు గ్రామంలో మహిళా రైతు జయలక్ష్మికి చెందిన 10 ఎకరాల పిఎండిఎస్ క్షేత్రాన్ని, సంజామలలో ఐసీఆర్‌పీ శ్రీనివాసులుకు చెందిన 1 ఎకరా శనగ ఏ-గ్రేడ్ మోడల్ పొలంను సందర్శించారు. పిఎండిఎస్ వేసిన పొలాన్ని దున్నకుండా ఆ పచ్చదనాన్ని పశుగ్రాసంగా మేపుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం సంజామల సదానంద బిఆర్సిని సందర్శించి కిట్ల పంపిణీ తీరును పరిశీలించిన తర్వాత, గ్రామ సచివాలయ ఆవరణంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు రైతులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. కిరణజన్య సంయోగక్రియ ద్వారా మొక్కలు భూమిలోని సూక్ష్మజీవులకు ఆహారాన్నిచ్చి తిరిగి పోషకాలు పొందుతాయని, జీవామృతం సూక్ష్మజీవులను మేల్కొలుపుతుందని తెలిపారు. యూరియా, డీఏపీలతో పనిలేకుండా ఏడాది పొడవునా పంటల వైవిధ్యంతో భూమిని పచ్చగా ఉంచాలని పిలుపునిచ్చారు. డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ “నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని కేవలం రూ. 60/-లకే నాణ్యమైన కిచెన్ గార్డెన్ కిట్లు లభిస్తున్నాయని, మహిళలందరూ పెరటి, మిద్దె తోటలను సాగు చేయాలని” కోరారు. సాయంత్రం యాగంటిపల్లె కేవీకేలో జరిగిన సమావేశంలో కేవీకే చైర్మన్ బాలాజీ, కేవీకే డైరెక్టర్ ధనలక్ష్మి, శాస్త్రవేత్తలు బాలరాజు, రమణయ్య, ఆదినారాయణ, సుధాకర్, మూర్తి, లక్ష్మిప్రియలతో పాటు బనగానపల్లె మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి ప్రకృతి సాగు విస్తరణపై సమగ్రంగా దిశానిర్దేశం చేశారు. పర్యటనలో డిస్ట్రిక్ట్ యాంకర్ జలాల్, డీపీఎం శ్రీనివాసులు, ఏడీపీఎం అబ్దుల్ సలాం, ఎన్ఎఫ్ఏ ఆచారి, ఎఫ్ఎంటీలు, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.





# డోన్ రైల్వే స్టేషన్‌లో ఘనంగా ‘రైల్ జన్ సంవాద్’

**డోన్ రైల్వే స్టేషన్‌లో ఘనంగా ‘రైల్ జన్ సంవాద్’వందేభారత్ రైలుకు స్టాపింగ్ కల్పించాలి.. ప్రతి ప్లాట్‌ఫారమ్‌పై ఉచిత వీల్‌చైర్లు ఏర్పాటు చేయాలి ప్రయాణికుల సమస్యలను పరిష్కరిస్తాం.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం: రైల్వే అధికారులు**

**డోన్ నంది పత్రిక అక్టోబర్ 16:** డోన్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే లక్ష్యంతో శుక్రవారం ‘రైల్ జన్ సంవాద్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు ఎదురవుతున్న సమస్యలు, మౌలిక సదుపాయాల మెరుగుదల, పరిశుభ్రత, వృద్ధులు, దివ్యాంగులకు కల్పించాల్సిన సౌకర్యాలపై ఈ సందర్భంగా చర్చించారు.

**ప్రయాణికులతో ముఖాముఖి** ఈ కార్యక్రమానికి ూణజుచీ బ్రహ్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్టేషన్ మేనేజర్ ప్రమోద్, ూఖీ/ూఖీ నాగభూషణ్, డోన్ రైల్వే స్టేషన్ చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి. విజయ్‌కుమార్ పాల్గొన్నారు. అధికారులు ప్రయాణికులు, రైల్వే సిబ్బందితో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, సూచనలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు.రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, రైళ్లలోనూ స్టేషన్లలోనూ పరిశుభ్రతను పాటించడం, రైల్వే వ్యవస్థను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేయడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అధికారులు పేర్కొన్నారు. ప్రయాణికులు తమకు ఎదురవుతున్న సమస్యలను అధికారుల దృష్టికి నేరుగా తీసుకురావడం ద్వారా వాటి పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని తెలిపారు.

**ప్రతి ప్లాట్‌ఫారమ్‌పై ఉచిత వీల్‌చైర్లు ఏర్పాటు చేయాలి**

వృద్ధులు, దివ్యాంగులు రైల్వే స్టేషన్‌లో రాకపోకలు సాగించే సమయంలో ఇబ్బందులు పడకుండా ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికుడు జి. విష్ణువర్ధన్ అధికారులను కోరారు. ముఖ్యంగా ప్రతి ప్లాట్‌ఫారమ్‌పై వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని, అవసరమైన ప్రయాణికులకు వాటిని ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీల్‌చైర్ల సదుపాయం అందుబాటులో ఉంటే వృద్ధులు, దివ్యాంగులు రైళ్లలోకి ఎక్కేందుకు, దిగేందుకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా వీల్‌చైర్లను ఒక ప్లాట్‌ఫారమ్ నుంచి మరో ప్లాట్‌ఫారమ్‌కు సులభంగా తీసుకెళ్లేందుకు అనువైన ర్యాంపులను నిర్మించాలని ఎస్. ఖాజా భాషా కోరారు. స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారమ్‌లకు సులభంగా చేరుకునేలా ర్యాంపుల సదుపాయం కల్పిస్తే దివ్యాంగులు, వృద్ధులతో పాటు నడవడానికి ఇబ్బందులు పడే ఇతర ప్రయాణికులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.

**డోన్‌లో వందేభారత్ రైలుకు స్టాపింగ్ కల్పించాలి** డోన్ రైల్వే స్టేషన్‌లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాపింగ్ కల్పించాలని ప్రయాణికుడు ఎం. మనోహర్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. డోన్ పట్టణం పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన రైలు ప్రయాణ సౌకర్యాలు అందుబాటులోకి రావాలంటే కీలకమైన రైళ్లకు ఇక్కడ నిలుపుదల కల్పించడం అవసరమని పేర్కొన్నారు. వందేభారత్ రైలుకు స్టాపింగ్ కల్పిస్తే ప్రయాణికులకు సమయం ఆదా కావడంతో పాటు వేగవంతమైన రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తుందని అభిప్రాయపడ్డారు.ఈ అంశాన్ని రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యాసాధ్యాలను పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాలని సూచించారు.

**45 మంది ప్రయాణికుల భాగస్వామ్యం** ఈ ‘రైల్ జన్ సంవాద్’ కార్యక్రమంలో సుమారు 45 మంది ప్రయాణికులు పాల్గొన్నారు. వారు తమకు ఎదురవుతున్న సమస్యలను అధికారులకు వివరించడంతో పాటు, రైల్వే సేవలను మెరుగుపరిచేందుకు పలు సూచనలు చేశారు. ప్రయాణికుల అభిప్రాయాలను అధికారులు శ్రద్ధగా విన్నారు. స్టేషన్‌లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వాటి వినియోగం, మరింత మెరుగుదల అవసరమైన అంశాలపై చర్చించారు.ప్రయాణికులు లేవనెత్తిన సమస్యలు, చేసిన విజ్ఞప్తులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామని రైల్వే అధికారులు హామీ ఇచ్చారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. డోన్ రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ప్రయాణికుల కు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం లభించింది. వందేభారత్ రైలుకు స్టాపింగ్, ఉచిత వీల్‌చైర్ల ఏర్పాటు, దివ్యాంగులకు అనుకూలమైన ర్యాంపుల నిర్మాణం వంటి విజ్ఞప్తులపై రైల్వే శాఖ స్పందించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి






**స్ట్రాంగ్ రూమ్‌లు, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలి**

**ఎన్నికల సామగ్రి పంపిణీ, సిబ్బంది రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి**

**జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌లు, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఎమ్మిగనూరు మండలం బనవాసి లోని జవహర్ నవోదయ విద్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను మరియు ఎమ్మిగనూరు పట్టణంలోని జూనియర్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ లను జాయింట్ కలెక్టర్ తో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ, సిబ్బంది రాకపోకలు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, భద్రతా చర్యలు, మౌలిక సదుపాయాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల విధులకు హాజరయ్యే పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ, విధులు ముగించుకుని తిరిగి వచ్చిన సిబ్బంది నుంచి సామగ్రి స్వీకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా అవసరమైన కౌంటర్లు, ఇతర సదుపాయాలను ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. సిబ్బంది ఎలాంటి గందరగోళానికి గురికాకుండా రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, ప్రవేశ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలను సూచించే బోర్డులను స్పష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సిబ్బంది తరలింపునకు వినియోగించే బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు రూట్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. వాహనాల నిలుపుదలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను గుర్తించి, వాహనాల రాకపోకలు సులభంగా సాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కేంద్రాల వద్ద రద్దీ నియంత్రణకు తగిన బ్యారికేడింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, గేట్ల నుంచి సంబంధిత కేంద్రాలకు చేరుకునేందుకు అనువైన మార్గాలను సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికల సామగ్రి భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లు, వాటికి అనుసంధానమైన ప్రాంతాల్లో ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రవేశ ద్వారాలు, కీలక ప్రాంతాలు, సిబ్బంది రాకపోకల మార్గాల్లో తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. భద్రతా చర్యల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల్లో టేబుళ్లను తగినంత దూరంతో క్రమబద్ధంగా ఏర్పాటు చేయాలని, ఓట్ల లెక్కింపు ప్రక్రియ స్పష్టంగా కనిపించేలా వీక్షణకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్లకు నిబంధనల ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, ప్రతి ఒక్కరికీ కేటాయించిన స్థానాలు, విధులు స్పష్టంగా తెలిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు, ఎన్నికల సిబ్బంది ప్రవేశానికి వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేసి, వారి రాకపోకలు కలవకుండా బ్యారికేడింగ్, పార్టిషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి తరలింపునకు ప్రత్యేక మార్గాన్ని సిద్ధం చేసి, కౌంటింగ్ ప్రక్రియకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణకు వచ్చే సిబ్బందికి అవసరమైన తాగునీరు, టాయిలెట్లు తదితర మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాల్లో తగినంత గాలి, వెలుతురు ఉండేలా చూడాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించి, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, ఎన్నికల విధుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఆదోని ఆర్డీవో అరుణ దేవి, ఆదోని అడిషనల్ ఎస్పీ జయ శర్మ, ఆదోని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్, డి.ఎస్.పి శ్రీనివాసులు, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఎమ్మిగనూరు ఉప తహశీల్దార్ వీరేంద్ర గౌడ్, సంబంధిత ఎన్నికల అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రుద్రవరంలో తొలిసారిగా అమ్మవారి బిందె సేవ.

**సరస్వతీ దేవి అలంకారంలో వాసవి మాత.**





**రుద్రవరం ప్రతినిధి అక్టోబర్ 16 (నంది పత్రిక):** మండల కేంద్రం రుద్రవరంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో అత్యంత పవిత్రమైన మూల నక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకుని వాసవి మాత చదువుల తల్లి, జ్ఞానప్రదాయిని అయిన 'సరస్వతీ దేవి' అలంకారంలో భక్తులకు కనువిందు చేశారు. ఈ ఏడాది ఉత్సవాల్లో తొలిసారిగా అమ్మవారి 'బిందె సేవ'ను అత్యంత ఘనంగా ప్రారంభించడం విశేషం. ఉదయం ఆలయంలో భక్తిశ్రద్ధలతో వెండి బిందెకు కలశ పూజ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, ఉపవాస దీక్షతో ఉన్న యువకులు అమ్మవారి బిందెను తలపై ఎత్తుకుని పురవీధుల్లో అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఊరేగింపులో ఆలయ కమిటీ ఏర్పాటుచేసిన కోలాట ప్రదర్శనలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పెద్దలు, సభ్యులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని చదువుల తల్లి ఆశీస్సులు పొందారు.



# ఆళ్లగడ్డలో మొదటి రోజు రెండువార్డులకు నామినేషన్లు దాఖలు




**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 16, నంది పత్రిక** ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో మొదటి రోజు అయిన శుక్రవారం రెండు వార్డులకు నామినేషన్లు దాఖలైనట్లు అసిస్టెంట్ ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. 16 వ వార్డుకు సంబంధించి అంబటి గోపాల్ రెడ్డి, 25 వ వార్డుకు సంబంధించి సింగారెడ్డి దామోదర్ రెడ్డిలు నామినేషన్ దాఖలు చేసినట్లు కమిషనర్ తెలిపారు. మరో రెండు రోజులు నామినేషన్లకు గడువు ఉన్నందున అభ్యర్థులు నామినేషన్ దాఖలుకు సంబందించిన పత్రములు మరోమారు సరిచేసుకొని అభ్యంతరాలు ఎదుర్కొనకుండా సరిఅయిన పత్రములతో వచ్చి నామినేషన్లు దాఖలు చేయాలని ఆయన తెలిపారు.

# ఆరోగ్యసూత్రాలు పాటిస్తే రోగాలు దరిచేరవు.

**కుటుంబంలో ఒకరిని కాపాడితే ఆ కుటుంబాన్ని కాపాడవచ్చు.**

**యోగా,వ్యాయామం,నడక తో చెక్కెర వ్యాధికి చెక్**

**పీఏడిపై డయాబెటిస్ బాధితులకు అవగాహన అవసరం**

**అవగాహన చికిత్స లేకుంటే కాలు పోయే ప్రమాదం .. డా శ్రీకాంత్ రాజు**

**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 16 ( నంది పత్రిక )** ప్రజలు ఆరోగ్యసూత్రాలు పాటిస్తూ,యోగా,వ్యాయామం,నడక తో చక్కెర వ్యాధి కి చెక్ పెట్టవచ్చని సీనియర్ కన్సల్టెంట్ వాస్కులర్ సర్జన్ ఎండోవాస్కులర్ సర్జన్, క్లీనికల్ డైరెక్టర్ యశోద హాస్పిటల్స్ (హైటెక్ సిటీ యూనిట్) డా ఎస్ శ్రీకాంత్ రాజు అన్నారు.డయాబెటిస్ రోగుల్లో కాళ్లకు రక్తప్రసరణ తగ్గడంపై అవగాహన అవసరమని పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూర్వకాలంలో పెద్దలు ఎంతో ఆరోగ్యంగా ఉండడానికి ప్రధాన కారణం వారి జీవన శైలి అని అన్నారు.ఆహారానికి తగ్గట్టు శ్రమించే గుణం ఉండడంతో రోగాలు దారి చేరవన్నారు.ప్రస్తుత ప్రపంచంలో ఫాస్ట్ ఫుడ్ కు అలవాటు పడటం యోగా,వ్యాయామం,నడక లేకపోవడం వల్ల ఊబకాయం తో పాటు అనారోగ్యాల భారిన పడుతున్నారన్నారు.చిన్న పని చేయాలన్నా చేయడం లేదని అన్ని పనులు చేయడంలో నిర్లక్షం వల్ల రోగాల భారిన పడుతున్నారని,ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటిస్తే రోగాలకు దూరంగా ఉండవచ్చన్నారు. డయాబెటిస్ ఉన్న వారిలో పెరిఫెరల్ ఆర్టీరియల్ డిసీజ్ (పిఏడి) సమస్య వేగంగా పెరుగుతోందని, డయాబెటిస్ రోగుల్లో ఈ సమస్య తీవ్రంగా ఉండి, చిన్న గాయాలు కూడా మానకుండా పుండ్లుగా మారే ప్రమాదం ఉందన్నారు. నరాల సమస్య కారణంగా కొందరిలో నొప్పి తెలియకపోవచ్చని హెచ్చరించారు. నడిచేటప్పుడు కాళ్లలో నొప్పి, కాళ్లు త్వరగా అలసిపోవడం, పాదాలు చల్లగా ఉండటం, మానని గాయాలు, వేళ్లు నల్లబడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సకాలంలో కాళ్ల రక్తపోటు పరీక్ష, డాప్లర్ స్కాన్ వంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యను ముందే గుర్తించి చికిత్స చేయవచ్చన్నారు. డయాబెటిస్




రోగులు రక్త చక్కెరను కట్టుదిట్టంగా నియంత్రించుకోవాలని, పొగతాగడం పూర్తిగా మానాలని, అవసరమైతే మందులు లేదా యాంజియోప్లాస్టీ వంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజు పాదాలను పరిశీలించడం, గాయాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సలహా తీసుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. ముందస్తు అవగాహన, సకాలంలో చికిత్సతో కాలు కోల్పోయే ప్రమాదాన్ని పూర్తిగా నివారించవచ్చని డా. శ్రీకాంత్ రాజు స్పష్టం చేశారు. కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ డిజీయం సంతోష్ కుమార్, యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ మేనేజర్ సుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై ఆర్ ఓ లు, ఏ ఆర్ ఓలకు పూర్తి అవగాహన ఉండాలి

**జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ**




**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 16 నంది పత్రిక** ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నిబంధనలు విధివిధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ అన్నారు.కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో శు క్రవారం,2026 ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ పత్రాల పరిశీలన, అభ్యర్థుల తుది జాబితా తయారీ, గుర్తుల కేటాయింపు, పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై అధికారులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల సంఘం జారీ చేసే మార్గదర్శకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, వాటిని తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని, సందేహాలుంటే శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన రికార్డులు, నివేదికలు, ఇతర అధికారిక పత్రాలను నిబంధనల ప్రకారం నిర్వహించాలన్నారు.ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశను నిర్ణీత నిబంధనలు, కాలపరిమితికి అనుగుణంగా పూర్తి చేసి, ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ సూచించారు.ముందుగా జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జి. రమణ, ఎంపీటీసీ జడ్పిటి సి ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ పి.గ్లోరియా,కలెక్టరేట్ కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ బి పి.ప్రభాకర్ రావు,డిప్యూటీ సీ ఈ వో వై దోసిరెడ్డి, డ్వామా పిడి డా.కె సి హెచ్ అప్పారావు,డి పి ఓ పి. విజయ భాస్కర్, ఆర్ ఓ లు, ఏ ఆర్ ఓ లు, తాహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.




# 2026-27ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి





**నవంబరు 5వ తేదీ నాటికి తాడేపల్లిగూడెం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించాలి**

**జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ**

**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 16 నంది పత్రిక**2026-27 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి వరి కోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా పొక్యూర్ మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2026-27 ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు సంబంధించి ప్రతి రైతు సేవా కేంద్రంలో అవసరమైన గోనె సంచులను ముందుగానే సిద్ధంగా ఉంచాలని, ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గోనె సంచుల్లో కనీసం 50 శాతం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం రవాణా కు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, రవాణా వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ధాన్యం తూకంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా తూకపు యంత్రాలను తనిఖీ చేసి, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు ధ్రువీకరించి ముద్రలు వేయాలని లీగల్ మెట్రాలజీ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి నిబంధనల ప్రకారం రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలను సమర్పించాలని స్పష్టం చేశారు.

రైతులకు ధాన్యం కొనుగోలు విధానం, నాణ్యతా ప్రమాణాలు, తేమ శాతం, ధాన్యం విక్రయానికి అవసరమైన రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతుల వివరాల నమోదు, ధాన్యం నాణ్యత పరిశీలన, కొనుగోలు అనంతర ప్రక్రియలపై శిక్షణా తరగతులు నిర్వహించాలని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌కు సూచించారు.ధాన్యం కొనుగోళ్లలో ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు.సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి 2026-27 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసి, రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ ఎండి ఇబ్రహీం, డీఎస్ఓ ఎం సరోజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి సునీత, జిల్లా కోపరేటి శాఖ అధికారి కె మురళీకృష్ణ , మార్కెటింగ్ శాఖ ఏడి సునీల్, లీగల్ మెట్రాలజీ శివబాలాజీ, ఏఎస్ఓస్ ఎం రవిశంకర్, ఏడి శ్రీనివాస్,ఎం వి ఐ ఎం డి జమీర్, తదితరులు పాల్గొన్నారు.



# ఇంద్రకీలాద్రిపై భక్తులకు అందుతున్న సేవలను స్వయంగా పరిశీలించిన ఎంపీ కేశినేని చిన్ని





## భక్తులతో నేరుగా మాట్లాడి సౌకర్యాలు, క్యూ లైన్లలో వేచి ఉండే సమయంపై ఆరా చిన్నారులు, వృద్ధులకు వేడి పాలు పంపిణీ వైద్య శిబిరం, భద్రతా ఏర్పాట్ల పరిశీలన

విజయవాడ బ్యూరో చీఫ్ అక్టోబర్ 16 నంది పత్రిక విజయవాడ ఇంద్రకీలాద్రిపై సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మ వారిని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎంపీ కేశినేనికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందించి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఎంపీ కేశినేని చిన్ని స్వయంగా పరిశీలించారు. క్యూ లైన్లలో వెళ్తున్న భక్తులతో నేరుగా మాట్లాడి, దర్శనానికి ఎంత సమయం పడుతోంది, భక్తులకు అవసరమైన సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సేవలు అందించాలని సూచించారు. క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు అందుబాటులో ఉండేలా పరిశీలించడంతో పాటు, చిన్నారులు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించారు. వారికి స్వయంగా వేడి పాలు అందించి ఆప్యాయతను చాటుకున్నారు. భక్తుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేయాల్సిన ఆవశ్యకతను ఆయన గుర్తుచేశారు.

**భక్తుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం** అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎంపీ కేశినేని చిన్ని సందర్శించారు. అక్కడ భక్తులకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో భక్తులకు తక్షణ వైద్య సహాయం అందేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా ఆలయ పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులతో చర్చించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టాలని, క్యూ లైన్ల నిర్వహణలో సమన్వయంతో వ్యవహరిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు.

**వేద విద్య అభ్యసిస్తున్న చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చట** ఈ సందర్భంగా వేద పాఠ్యాంశాలను అభ్యసిస్తున్న చిన్నారులతో ఎంపీ కేశినేని చిన్ని సరదాగా ముచ్చటించారు. వారు నేర్చుకుంటున్న వేద విద్య, అధ్యయన వివరాలను అడిగి తెలుసుకుని, చిన్నారులతో ఆప్యాయంగా గడిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు మెరుగైన సౌకర్యాలు, సురక్షితమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఆలయంలో అందుతున్న సేవలు, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను ఎంపీ కేశినేని చిన్ని స్వయంగా పరిశీలించడం విశేషం.



# పట్టణ అభ్యర్థుల ఎన్నికల వ్యయ పరిమితులు ఇవే



గుంటూరు బ్యూరో చీఫ్ అక్టోబర్ 16 నంది పత్రిక ఎన్నికలలో అభ్యర్థులు చేయాల్సిన వ్యయ పరిమితులను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిందని కలెక్టర్ ;జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ అన్నారు. ఈ మేరకు వ్యయ వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

మేయర్ అభ్యర్థికి రూ.25 లక్షల పరిమితి.

నగర పాలక సంస్థ వార్డు సభ్యులకు రూ.10 లక్షలు

పురపాలక సంఘం అధ్యక్షులకు రూ. 20 లక్షలు

పురపాలక సంఘంలో వార్డు సభ్యులకు రూ.7.50 లక్షలు

అభ్యర్థులు వారికి నిర్దేశించిన పరిమితుల వరకు మాత్రమే వ్యయం చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల నియమావళి పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై సంబంధిత నోడల్ అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుసరించి లేని ఏ అంశాన్ని ఉపేక్షించరదన్నారు. వ్యయ కమిటీలు, స్టాటిక్ సర్వేలియన్స్ బృందాలు వీడియో వ్యూయింగ్ బృందాలు, ఎం.సి.సి బృందాలు రేయింబవళ్ళ తనిఖీ నిర్వహించాలని స్పష్టం చేశారు. సంబంధిత నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, డిప్యూటీ కలెక్టర్ లు గంగ రాజు, డేవిడ్, వెంకటేశ్, ఎస్.జి.ఎస్.డబ్ల్యు సమన్వయ అధికారి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వాసవీ మాతను దర్శించుకున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్





విజయవాడ బ్యూరో చీఫ్ అక్టోబర్ 16 నంది పత్రిక నాగాయలంకలో శ్రీదేవి శరన్నవరాత్రి వేడుకల్లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. గ్రామంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి సమన్విత పార్వతి సమేత నగరేశ్వర స్వామి వారి దేవాలయంలో శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవార్లను కమిటీ ఆధ్వర్యంలో సరస్వతి దేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు కొల్లిపర సుబ్బారావు పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజ, విద్యార్థినీ, విద్యార్థులచే సరస్వతి పూజ చేయించారు. కమిటీ ప్రతినిధుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చిట్టా సాంబశివరావు అయనను సత్కరించగా, అర్చకులు స్వామివారి ఆశీస్సులు అందచేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి తరలివచ్చిన విద్యార్థులకు కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతులమీదుగా నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖులు బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ పెద్దలు చిట్టా వీర అన్నపూర్ణయ్య, చిట్టా శివ నాగేశ్వరరావు, తాడికొండ సత్యనారాయణ, మునగాల మోహనరావు, చిట్టా హారేకృష్ణ పాల్గొన్నారు.



# బాపట్ల జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి.,ఐ. ఏ.ఎస్.,

బాపట్ల బ్యూరో చీఫ్ అక్టోబర్ 16 నంది జిల్లాలో మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్, (యం పి టి సి,జడ్పీటీసీ), గ్రామ పంచాయతీల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కఠినంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్ నందు విలేకరుల సమావేశంలో ఆయన ఎన్నికల షెడ్యూల్, ఏర్పాట్లు, ప్రవర్తనా నియమావళి అమలు తదితర అంశాలను మీడియాకు వివరించారు. చీరాల, రేపల్లె మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. బాపట్ల మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియ కోర్టు కేసు కారణంగా నిలిపివేయబడిందని, న్యాయపరమైన అంశం పరిష్కారమైన అనంతరం సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామని పేర్కొన్నారు.రాష్ట్ర ఎన్నికల సంఘం అక్టోబర్ 14న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని, ఎన్నికల ప్రక్రియ పూర్తయి ఫలితాలు ప్రకటించే వరకు ఇది కొనసాగుతుందన్నారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై అధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ భవన వశిష్ట పర్యవేక్షణలో, రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు, మండల స్థాయిలో తహసీల్దార్లు నియమావళి అమలును పర్యవేక్షిస్తారని తెలిపారు.ప్రభుత్వ అధికారులు రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనకూడదని, ఎన్నికల నియమావళికి విరుద్ధంగా కొత్త ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రారంభమైన అభివృద్ధి పనులను సంబంధిత ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా కొనసాగించవచ్చని తెలిపారు.రాజకీయ ప్రకటనలు, ప్రచార సామగ్రి విషయంలో ఎన్నికల సంఘం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అవసరమైన అనుమతులు పొందిన తర్వాతే ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు

1.పురపాలక ఎన్నికలు.చీరాల,రేపల్లె మున్సిపాలిటీ లకు



నోటిఫికేషన్ తేదీ : అక్టోబర్ 14

నామినేషన్లగడువు:అక్టోబర్ 18.

ఉపసంహరణ : అక్టోబర్ : 21.

పోలింగ్ తేదీ : అక్టోబర్ 28

ఓట్లు లెక్కింపు : అక్టోబర్ 30

జిల్లా ప్రజా పరిషత్

నోటిఫికేషన్ తేదీ :అక్టోబర్ 19

నామినేషన్లు గడువు: అక్టోబర్ 23.

ఉపసంహరణ తేదీ : అక్టోబర్ 27

పోలింగ్ తేదీ : నవంబర్ 03.

ఓట్లు లెక్కింపు నవంబర్ 05.

పంచాయతీ తొలివిడత.

నోటిఫికేషన్ తేదీ ; నవంబర్ 13.

నామినేషన్లు గడువు: నవంబర్ 17

ఉపసంహరణ : నవంబర్ 21.

పోలింగ్ : నవంబర్ 26.

ఓట్లు లెక్కింపు:నవంబర్ 26.

పంచాయతీ 2 (రెండో)విడత

నోటిఫికేషన్ తేదీ : నవంబర్ 16.

నామినేషన్లు గడువు : నవంబర్ 20

ఉపసంహరణ : నవంబర్ 24.

పోలింగ్ తేదీ : నవంబర్ 29.

ఓట్లు లెక్కింపు : నవంబర్ 29.

3 మూడో విడత

నోటిఫికేషన్ తేదీ : నవంబర్ 19.

నామినేషన్లు గడువు : నవంబర్ 23

ఉపసంహరణ : నవంబర్ 27.

పోలింగ్ తేదీ : డిశంబర్ 02.

ఓట్లు లెక్కింపు : డిశంబర్ 02.

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఉదయం పోలింగ్ నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

**ఎన్నికల ఏర్పాట్లు ముమ్మరం** ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు కలెక్టర్ చెప్పారు. ఇప్పటికే మూడు విడతల శిక్షణ పూర్తయిందని, ఓట్ల లెక్కింపు వరకు అవసరమైన తదుపరి శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తామని తెలిపారు. చీరాల, బాపట్ల, రేపల్లెల్లో రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారిని జిల్లా ఎన్నికల పరిశీలకుడిగా నియమించనున్నట్లు తెలిపారు. పోలీసు బందోబస్తు, శాంతిభద్రతల పర్యవేక్షణకు గుంటూరు రేంజ్ పరిధిలో ఐజీ స్థాయి అధికారి పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

**ఓటర్లు జాబితాలను పరిశీలించాలి** ఓటర్లు తమ పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో ముందుగానే పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలను ప్రచురించినట్లు తెలిపారు. ఎంపీటీసీ కి పింక్, జెడ్పీటీసీ, ఎన్నికల్లో ఓటర్లు రెండు వేర్వేరు బ్యాలెట్ పత్రాల ద్వారా ఓటు వేయాల్సి ఉంటుందని వివరించారు. ఎంపీటీసీకి గులాబీ రంగు బ్యాలెట్ పత్రం, జెడ్పీటీసీకి తెలుపు రంగు బ్యాలెట్ పత్రం ఉంటాయని చెప్పారు. రెండు ఎన్నికలు ఒకేసారి జరుగుతున్నందున ఓటర్లు ఓటింగ్ విధానంపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

**ఫిర్యాదులకు ప్రత్యేక వ్యవస్థ** జిల్లాలో ఎక్కడైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు చోటుచేసుకుంటే ప్రజలు కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌తో పాటు రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారని తెలిపారు.

ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, అధికారులు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# పటిష్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

## - నిష్పాక్షికంగా, పారదర్శకంగా అమలుకు చర్యలు

## - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ బ్యూరో చీఫ్ అక్టోబర్ 16 నంది పత్రిక గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల 2వ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్)ని పటిష్టంగా అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఈ మేరకు ప్రవర్తనా నియ మావళిని నిష్పాక్షికంగా, పారదర్శకంగా అమలు చేయడానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్లలో ఉన్న మంత్రులు, రాజకీయ నాయకులు లేదా రాజ కీయ పార్టీల వివరాలన్నింటినీ తొలగించాలి లేదా కప్పి ఉంచాలని.. అదేవిధంగా ప్రభుత్వ నిధులతో ఏర్పాటుచేసిన హోర్డింగ్‌లు, ప్రకటనల్లో రాజకీయ నాయకులు, రాజకీయ పార్టీల ఫొటోలు, పేర్లు, గుర్తులు, సందేశాలను తొలగించాలని సూచించారు. రాజకీయ నాయకుల విగ్రహాలను పూర్తిగా కప్పి ఉంచాలని, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంతకాలం జారీచేసే విద్యుత్, నీటి బిల్లులపై రాజకీయ ప్రచారానికి సంబంధించిన ఫొటోలు, సందేశాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఎంసీసీకి సంబంధించిన అన్ని మార్గదర్శకాలను తు.చ. తప్ప కుండా పాటించాలని.. నిబంధనల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ లక్ష్మీ శ స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ప్రత్యేక బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ.

కర్నూల్ సిటీ నందిపత్రిక స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా గూడూరు మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణం ఇండోర్ భవనంలో ఏర్పాటు చేస్తున్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి , జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ , జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పరిశీలించారు.ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సమీక్షించి, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు.



# పోలకల్ గ్రామంలోని అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

కర్నూల్ సిటీ నంది పత్రిక స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు శుక్రవారం సి.బెళగల్ మండలం , పోలకల్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.అత్యంత సమస్యాత్మక ప్రాంతంగా గుర్తించిన నేపథ్యంలో పోలింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లు, రూట్ మ్యాప్, పటిష్ట బందోబస్తు, పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు ప్రణాళికతో భద్రతను పటిష్టం చేయాలని, నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు.గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్, రూట్ మార్చ్‌లు నిర్వహించి ప్రజల్లో భరోసా కల్పించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు సీఐ తబ్రేజ్, సి.బెళగల్ ఎస్ఐ వేణుగోపాల రాజు, గూడూరు ఎస్ఐ రాజా కుళాయప్ప పాల్గొన్నారు.



# ఇంద్రకీలాద్రిపై వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

**భక్తులకు అద్భుతమైన ఏర్పాట్లు.**
**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాల నిర్వహణ**
**భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి.**
**ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**

**విజయవాడ బ్యూరో చీఫ్ అక్టోబర్ 16 నంది పత్రిక** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం అమ్మవారి దర్శనం అనంతరం అందరికిలాద్రి మీడియా పాయింట్ వద్ద మంత్రి మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి విచ్చేస్తున్న భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దేవాదాయ శాఖ, పోలీస్ శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. భక్తుల రద్దీని నిరంతరం పర్యవేక్షిస్తూ, దర్శన ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వహణలో అధికారుల సమష్టి కృషి అభినందనీయమని అన్నారు. ఇప్పటివరకు దాదాపు 4.80 లక్షల మంది భక్తులు శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకోవడం సంతోషకరమని తెలిపారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చినప్పటికీ దర్శన ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించిన ఆలయ అధికారులు, పోలీస్ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరినీ ప్రశంసించారు గతంలో మూలా నక్షత్రం వంటి ప్రధాన పర్వదినాల్లో భక్తుల రద్దీ కారణంగా బారికేడ్ల వద్ద క్యూ లైన్లు నిలిచిపోవడం, వీఐపీ దర్శనాల వల్ల సాధారణ భక్తులకు ఇబ్బందులు ఎదురవడం వంటి పరిస్థితులు తలెత్తేవని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ఆదేశాల మేరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, సాధారణ భక్తులకు ప్రాధాన్యతనిచ్చేలా దర్శన ఏర్పాట్లను రూపొందించినట్లు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వీఐపీ దర్శనాలను కూడా గణనీయంగా తగ్గించి, సామాన్య భక్తులకు సులభంగా అమ్మవారి దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. దర్శన క్యూలైన్ల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ఆధారంగా రద్దీ పరిస్థితులను పర్యవేక్షిస్తూ, క్యూ లైన్లు ఎక్కడా నిలిచిపోకుండా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. భక్తులు ఎక్కువసేపు క్యూలైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితులు తగ్గాయని, దర్శన ప్రక్రియ మరింత సులభతరంగా మారిందని పేర్కొన్నారు. భక్తులు సైతం ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తుల ఆరోగ్యం, సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. భక్తులకు నిరంతరంగా తాగునీరు, మజ్జిగ అందించడంతో పాటు చిన్నారుల కోసం పాలు కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భారీ రద్దీ ఉన్నప్పటికీ భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈరోజు సాయంత్రం అమ్మవారికి ముఖ్యమంత్రి



పట్టువస్త్రాల సమర్పణ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఈరోజు సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఆలయ అధికారులు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించే కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా జరిగేలా సంబంధిత శాఖలు సమన్వయంతో వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలని కోరుకున్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతాంగానికి మేలు జరగాలని, ప్రజలందరికీ మంచి రోజులు రావాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.

## అవుకుమెట్ట జంక్షన్ ఆధునికీకరణ పనుల పరిశీలన



**బనగానపల్లె అక్టోబర్ 16నందిపత్రిక** బనగానపల్లె పట్టణ పరిధిలోని అవుకుమెట్ట జంక్షన్‌లో ఆధునికీకరణలో భాగంగా చేపడుతున్న పనులను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జంక్షన్ ఆధునికీకరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేలా పనులు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.



## తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికలు

**తొలిరోజు మేయర్ స్థానానికి ఒకటి, కార్పొరేటర్ స్థానాలకు 88 నామినేషన్ల దాఖలు**
**మేయర్ అభ్యర్థిగా ఆమ్ ఆద్మీ పార్టీ తరపున నీరుగట్టు నగేష్ నామినేషన్**



**తిరుపతి, బ్యూరో చీఫ్ అక్టోబరు 16 నంది పత్రిక** తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు ప్రక్రియ తొలిరోజైన శుక్రవారం మేయర్ స్థానానికి ఒక నామినేషన్, కార్పొరేటర్ స్థానాలకు 88 నామినేషన్లు దాఖలయ్యాయి. మేయర్ స్థానానికి ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థిగా నీరుగట్టు నగేష్ నామినేషన్ దాఖలు చేశారు. కార్పొరేటర్ స్థానాలకు వివిధ రాజకీయ పార్టీలు, ఇతర అభ్యర్థుల నుంచి మొత్తం 88 నామినేషన్లు దాఖలయ్యాయి. పార్టీలు, ఇతరుల వారీగా నామినేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి: తెలుగుదేశం పార్టీ 10 వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 61 జనసేన పార్టీ 4 సీపీఐ 1ఇతరులు 12 తొలిరోజు మేయర్, కార్పొరేటర్ స్థానాలకు కలిపి మొత్తం 89 నామినేషన్లు దాఖలయ్యాయి.

## శ్రీ మహాలక్ష్మి అమ్మవారు " శ్రీ మహాలక్ష్మి దేవి అలంకరణతో " భక్తులకు దర్శనం.



**బేతంచెర్ల అక్టోబర్ ట నంది పత్రిక ).** బేతంచెర్ల మండల పరిధిలో ఆర్ఎస్ రంగాపురం గ్రామం సమీపంలో ఉన్న ప్రముఖ వైష్ణవ క్షేత్రం శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి దేవస్థానంలో శరణ్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆరవ రోజు శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి పూజలు, చతుస్థానార్చన, విశేష తిరుమంజనం (మూలమూర్తి), అర్చనారాధన, వేదపారాయణం, మూల మంత్రం, శ్రీ సూక్త హవనాధులు, సహస్ర దీపాలంకరణ సేవ, లలితా సహస్రనామ కుంకుమార్చన, నిర్వహించారు. "శ్రీ మహాలక్ష్మి దేవి" గా పట్టు వస్త్రాలు ఆభరణాలు మరియు పూలతో అలంకరించి ఉత్సవ మూర్తిని ప్రత్యేకమైన వాహనం పై వేంచేపు చేసి ఆలయ ప్రాంగణంలో ఊరేగించడం జరిగింది. ఈ కార్యక్రమాలు దేవస్థాన డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి ఎం.రామాంజనేయులు గారు , ధర్మకర్తల మండలి ఛైర్మన్ వి.ఎల్ల నాగయ్య గారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు,వేద పండితులు,అర్చక స్వాములు,ఆలయ సిబ్బంది మరియు భక్తులు ఘనంగా ఈ వేడుకల్లో పాల్గోని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

## శ్రీసరస్వతీదేవి గా దర్శనం ఇచ్చిన శ్రీ కాళికామాత

**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 16, నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని విశ్వరూప పారిశ్రామిక నగర్ లో వెలసిన శ్రీశ్రీశ్రీ కాళికామాత దేవస్థానము నందు శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు శ్రీసరస్వతీ దేవి అలంకారంలో కొలువు తీరారు. అర్చకులు చంద్రశేఖర్ ఆచార్యులు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం పట్టణంలోని విశ్వబ్రాహ్మణ కుటుంబ ఇండ్ల దగ్గరకు బిందెసేవ నిర్వహించారు. సాయంత్రం మహిళా కమిటీ సభ్యులు కబడ్డీ పోటీలు, మ్యూజికల్ చైర్స్ లాంటి వినోదభరిత కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చేరివచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు అల్పాహారం పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు, యువజన కమిటీ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## పుంగనూరులో వైఎస్సార్‌సీపీ దౌర్జన్యాలపై గుడిసె ఆది కృష్ణమ్మ తీవ్ర ఆగ్రహం

**నామినేషన్ పత్రాలు లాక్కున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి**
**ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తే సహించేది లేదు!**
**కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** పుంగనూరులో టీడీపీ నేత మధు రాయల్‌పై దాడి జరిగిందని, నామినేషన్ పత్రాలను లాక్కున్నారని వస్తున్న ఆరోపణలపై కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా పోటీ చేయడం ప్రతి అభ్యర్థికి ఉన్న హక్కు. ఆ హక్కును అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలను లాక్కున్నారనే ఆరోపణలు రావడం ప్రజాస్వామ్య వ్యవస్థకే సవాలు విసిరినట్లుగా ఉంది. ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందాలి కానీ, ప్రత్యర్థులను అడ్డుకునే ప్రయత్నాలు చేయడం ఏమిటి? రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారనే అనుమానాలకు తావివ్వకుండా అధికారులు వాస్తవాలను బయటపెట్టాలి" అని అన్నారు. టీడీపీ నేత మధు రాయల్‌పై దాడికి సంబంధించి ఎంపీ మిథున్ రెడ్డి, ఆయన అనుచరులపై వచ్చిన ఆరోపణలను పోలీసులు తేలిగ్గా తీసుకోకూడదు. ఘటనకు సంబంధించిన వీడియోలు, సీసీటీవీ ఫుటేజీ, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించి నిష్పక్షపాతంగా విచారణ జరపాలి. తప్పు చేసినవారు ఎవరైనా సరే, ఆధారాల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. రాజకీయ పలుకుబడితో ఎవరినీ కాపాడే ప్రయత్నం చేయకూడదు" అని ఆమె డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడం, అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం, పోలీసు యంత్రాంగంపై ఉంది. నామినేషన్ పత్రాల వ్యవహారంపై పూర్తి వివరాలు సేకరించి, బాధితుడికి న్యాయం జరిగేలా తక్షణ చర్యలు చేపట్టాలి" అని పేర్కొన్నారు. "ప్రజాస్వామ్యంలో ప్రజలే నిర్ణేతలు.. బెదిరింపులు కాదు, దౌర్జన్యాలు కాదు! ఎన్నికల ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నాలను సహించకూడదు. పుంగనూరు ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు మా డిమాండ్‌ను బలంగా వినిపిస్తాం. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉంటుంది" అని గుడిసె ఆది కృష్ణమ్మ స్పష్టం చేశారు.

## కర్నూలు మెడికల్ కాలేజీ స్కిల్ ల్యాబ్‌లో వరల్డ్ అనస్థీషియా డే కార్యక్రమం



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు మెడికల్ కాలేజీ స్కిల్ ల్యాబ్‌లో వరల్డ్ అనస్థీషియా డే సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరల్డ్ అనస్థీషియా డే ప్రాముఖ్యతను గుర్తుచేసుకుంటూ, అనస్థీషియా వైద్య శాస్త్ర పితామహుడిగా గుర్తింపు పొందిన డాక్టర్ విలియం థామస్ గ్రీన్ మోర్టన్ (డబ్ల్యూ .టీ .జి . మోర్టన్ ) చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, శస్త్రచికిత్సల సమయంలో రోగులకు నొప్పి లేకుండా సురక్షితమైన వైద్య సేవలు అందించడంలో అనస్థీషియా వైద్యుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. అలాగే రోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ఆధునిక వైద్య పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని వైద్యులు, వైద్య విద్యార్థులకు సూచించారు. స్కిల్ ల్యాబ్‌లో అందించే ప్రాక్టికల్ శిక్షణ వైద్య నైపుణ్యాలను పెంపొందించడంలో ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అనస్థీషియా వైద్య సేవల ప్రాముఖ్యత, రోగుల భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ తో పాటు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డా హరిచరణ్ అలాగే క్యాన్సర్ హాస్పిటల్ ఇంచార్జి డా ప్రకాష్, అనెస్టేషియా విభాగం నుండి డా విశాల మరియు డా సుధీర్ పాల్గొన్నారు.

## నంద్యాలలో ఎన్నికల సందడి

**తొలిరోజు 12 నామినేషన్లు.. 256 మందికి ఎన్ఓసీలు**



**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 16 ( నంది పత్రిక)** నంద్యాల మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజు కౌన్సిలర్ అభ్యర్థులుగా తెలుగుదేశం పార్టీ తరఫున 7 మంది, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 5 మంది మొత్తం 12 నామినేషన్లు దాఖలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ ఆదివారం వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుందని కమిషనర్ వెల్లడించారు. అభ్యర్థులు నిర్ణీత గడువులోగా నామినేషన్లు దాఖలు చేయాలని సూచించారు. చివరి రోజు వరకు వేచి ఉండకుండా ముందుగానే అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. నామినేషన్ల దాఖలుకు అవసరమైన నిరభ్యంతర ధ్రువపత్రాల (ఎన్ఓసీ) కోసం 256 మంది తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నామినేషన్ల సమయంలో అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు. రానున్న రోజుల్లో మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉండటంతో మున్సిపల్ ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



## గూడూరు , జులకల్ గ్రామంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఎన్నికల నేపథ్యంలో గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గూడూరు, జులకల్ గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రాలను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాత నేరస్థులు, ఎన్నికల సమయంలో గొడవలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు సీఐ తబ్రేజ్, గూడూరు ఎస్ఐ రాజా కుళాయప్ప, సి. బెళగల్ ఎస్ ఐ వేణుగోపాల రాజు పాల్గొన్నారు.

## చండీ యాగంలో పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు.. దసరా నవరాత్రుల సందర్భంగా పంచలింగాల గ్రామంలోని పాత స్కందా లో గల శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో నిర్వహించిన చండీ యాగం లో ఆయన పాల్గొన్నారు.. ముందుగా ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహన్ని దర్శించుకుని, పూజలు చేసిన ఎంపీ, అనంతరం చండీ యాగంలో పాల్గొని యాగం చేశారు.

## జాతీయ డ్రాగన్ బోట్ పోటీలకు కర్నూలు క్రీడాకారులు



**కర్నూలు సిటీ నంది పత్రిక** డ్రాగన్ బోట్ ఇండియా అండ్ ట్రెడిషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 20 వరకు ఢిల్లీలో జరిగే 13వ జాతీయ సీనియర్ పురుషుల డ్రాగన్ బోట్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు శుక్రవారం కర్నూలు రైల్వే స్టేషన్‌లో రాష్ట్ర డ్రాగన్ బోట్ అసోసియేషన్ కార్యదర్శి అవినాష్ శెట్టి క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్ అందించి వీడ్కోలు పలికారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# భారత దేశ విజ్ఞాన వ్యవస్థ అమోఘ మైనది.

### డాక్టర్ పసుపులేటి శంకర్

**కడప అక్టోబర్ 16 (నంది పత్రిక రిపోర్టర్)** భారత దేశ విజ్ఞాన సంపద ప్రపంచానికే మార్గదర్శకమని మైదు కూరు సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి శంకర్ అన్నారు.విజయవాడ దూరదర్శన్ కేంద్రము వారు చేపట్టిన భారత విజ్ఞాన వ్యవస్థ గురించి జరిగిన చర్చవేదికలో డాక్టర్ శంకర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వము భారతీయ విజ్ఞాన వ్యవస్థ అనే సంస్థను 2020 అక్టోబర్ 5 న స్థాపించడము శుభపరిణామమన్నారు. విద్యా వ్యవస్థ ఏకీకరణ, వేగవంతమైన సాంకేతిక అభివృద్ధి,పర్యావరణ సంక్షోభం, సాంస్కృతిక ఏకీకరణ, మానసిక ఆరోగ్య సమస్యల సమతుల్యత కోసం శ్రమించే ఈ సంస్థ భావి భారత యువతకు మంచి దిశా నిర్దేశం చేయగలదన్నారు. మనదేశములోని మహర్షులు దర్శించి రచించిన నాటి గ్రంధాలు నేటికీ ప్రామాణికాలుగా ఉన్నాయన్నారు. వైద్యరంగములో చరకులు, శుశ్రుతుల వారి పేర్లు ముందు వరసలో వుంటాయన్నారు. కావేరి నది మీద కరికాళచోళు లవారు 1850 సంవత్సరాల క్రింద నిర్మించిన రాతి ఆనకట్ట ప్రపంచములో మొదటిది అయినా నేటికీ చెక్కుచె దరకుండా 10 లక్షల ఎకరాలకు నీరం దిస్తు న్నదని వివరించారు. మిహిరాచార్యుల వారి బృహత్ సంహిత గ్రంధము వ్యవసాయ,భూగోళ,ఖగోళ,జ్యోతిష్య, గణిత శాస్త్రాల అధ్యాయనానికి అద్భు తమైన గ్రంధమన్నారు. భూకంపాలు ఎప్పుడు వస్తాయి, మేఘోత్పత్తి ఎలా జరుగుతుంది, వ్యవసాయం లో రైతులు ఆషాడ మాసం పూర్వషాడ లేదా ఉత్తరాశాడ నక్షత్రములో విత్తనాలు చల్లాలన్న విషయము, భూమిలో నీరు ఎక్కడ ఎంత లోతులో ఉంటుందనే విషయము ఈ గ్రంధం లో ఉన్నాయని వివరించారు. భాస్కరా చార్యుల వారు తన కుమార్తె పేరున రచించిన లీలావతి గణితము ప్రపంచ బాషలలోకి తర్జుమా చేయబ డిందన్నారు. ఆర్యభట్ట వారి రచనలు, ఆవిష్కరణలు సున్నాను కనిపెట్టిన విధానము శాస్త్ర రంగాన్ని మార్చివేశా యన్నారు. చాణక్యుని అర్థశాస్త్రము నేటికీ ఆదర్శప్రాయ మన్నారు. కైలాస మందిరము, భృహదీశ్వర,పూరి,హంపి దేవాలయల నిర్మాణాలు నేటి ఇంజినీరింగ్ వ్యవస్థకు సవాలుగా ఉన్నాయ న్నారు. బేలూరు హాలిబేడు లోని శిల్పాలలోని రాళ్లలో సరిగమపదనిసలు పలికించి శిల్ప శాస్త్రములో ఆద్యులము అని నిరూపించుకున్నామన్నారు. ప్రపంచములో తక్షశిల తొలి విశ్వావిద్యాల యమన్నారు. ఇంగ్లాండ్ లో 1811 లో తొలి పాఠశాల ఏర్పాటు చేసేనాటికి భారతదే శములో 732000 గురుకులాలు ఉన్నాయ న్నారు. అమెరికా అంతరిక్ష నాసా సంస్థ అంగారక గ్రహం పైన నీరు ఉందని 2015 లో ప్రకటించింది. మిహిరులవారు బృహత్ సంహితలో అశీగారకుని మీద నీటితో పాటు ఇనుము కూడా ఉందన్నారు. 1903 లో రైట్స్ సోదరులు విమానం




ఎగురవేయడం కంటే ముందు 1898 లో మనదేశానికి చెందిన శివకర్ బాపూజీ తల్పడే విమానం ఆకాశములో నడిపారన్నారు. సాహిత్యం లో శ్రీ రామాయణము శ్రీ మహాభారతము ముందు రచనలు ఎప్పుడు వినలే దన్నారు . ప్రపంచము పదార్థాలపై పరిశోదనలు చేస్తే భారత దేశము యా దార్థలపై చేసిందన్నారు. ప్రపంచము వస్తువుల గురించి విచారిస్తే భారత దేశము వాస్తవాల గురించి విచారిస్తున్నదన్నారు. సర్వేజనా సుఖినోభవంతు అనే విజ్ఞానం ఒక్కభారత్ దేశములో ఉంది అందుకే కరోనా సమయములో ప్రపంచములోని పలు దేశాలకు కరోన వాక్సిన్ ఉచితంగా అందించాము. భారతీయ విజ్ఞాన వ్యవస్థ మరింత బలపడాలన్న ప్రచారం జరగాలంటే సంస్కృత భాష పరిఢ విల్లాలని అన్నారు. విద్య, వైద్య, ఆయుర్వేదం, వ్యవసాయం, ఖగోళ,భోగోళ తదితర అంశాల గురించి యాంకర్ గగన అడిగిన పలు ప్రశ్నలకు శంకర్ సమాధానాలిచ్చారు

# వైసీపీ ఓటమి భయంతోనే అల్లర్లు సృష్టిస్తుంది

### తాడేపల్లి ప్యాలస్ డైరెక్షన్లోనే దాడులకు తెగబడుతున్న గొడ్డలి పార్టీ నాయకులు కార్యకర్తలు

### ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్పర్సన్ కమ్మరి పార్వతమ్మ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** పుంగనూరు, రాయచోటి, తిరుపతిలో జరిగిన ఘటనలు వైసీపీ గొడ్డలి ముఠా హింసా సంస్కృతికి నిదర్శనమని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ మండిపడ్డారు.

**ప్రధాన అంశాలు:** తాడేపల్లి ప్యాలస్ డైరెక్షన్ లోనే స్థానిక ఎన్నికలను అడ్డుకోవాలని వైసీపీ గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోంది. c ఓటమి భయంతో తొలి రోజు నుంచే దాడులు, భయోత్పాతం సృష్టిస్తోంది. పొరుగు రాష్ట్రాల నుంచి రౌడీలను తెచ్చి దాడులకు పాల్పడుతోంది. నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, పత్రాలు చించడం, అభ్యర్థులపై దాడులు, అధికారులను బెదిరించి దొంగ ఏకగ్రీవాలు చేసుకోవడం వైసీపీ ఫ్యాక్షన్ సంస్కృతి. c ప్రజాబలం, సంక్షేమం, అభివృద్ధితో ప్రజల్లోకి వెళ్తున్న కూటమి ప్రభుత్వానికి దాడులు చేసే అవసరం లేదు. ప్రజల్లో పట్టు లేక, డిపాజిట్లు కూడా రావని తెలిసే వైసీపీయే ఈ అల్లర్లు సృష్టిస్తోంది. c ఇది గత 5 ఏళ్ల అరాచక పాలన కాదు, చట్టబద్ధంగా నడుస్తున్న ప్రజా ప్రభుత్వం. అల్లర్లు చేసే వారు ఏ స్థాయి నేత అయినా చట్టం కఠినంగా వ్యవహరిస్తుంది. c పెన్షన్ల పెంపు, ఉచిత గ్యాస్, అన్న క్యాంటీన్లు, తల్లికి వందనం వంటి పథకాలతో కూటమిపై ప్రజల్లో తిరుగులేని నమ్మకం ఉంది. c అధికారులు వైసీపీ కుట్రలను గట్టిగా అడ్డుకొని, ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేలా చూడాలని కోరుతున్నాం. ఈ ఎన్నికల్లో ఓటర్లు ఇచ్చే తీర్పుతో వైసీపీ ఫ్యాక్షన్ సంస్కృతికి శాశ్వతంగా సమాధి పడటం ఖాయమని పార్వతమ్మ అన్నారు.

# 34వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన చింతలపల్లి రామకృష్ణ



**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని 34వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థిగా భారతీయ జనతా పార్టీ తరఫున కూటమి అభ్యర్థిగా చింతలపల్లి రామకృష్ణ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని, ప్రజాసేవా లక్ష్యాలను ప్రజలకు, కూటమి శ్రేణులకు వివరించారు. 1999 సంవత్సరం నుంచి క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతూ, ఈ క్రమంలో భారతీయ జనతా పార్టీలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ, జిల్లా ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా పని చేశానని చెప్పారు. రాజకీయ అనుభవంతో పాటు ప్రజల సమస్యలపై అవగాహన కలిగి, ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కర్నూలు నగర అభివృద్ధితో పాటు ముఖ్యంగా 34వ వార్డు ప్రజల సంక్షేమం కోసం కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని చింతలపల్లి రామకృష్ణ పేర్కొన్నారు. కూటమి పెద్దల సహకారంతో వార్డులో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారం, రహదారుల అభివృద్ధి వంటి ప్రజలకు అవసరమైన పనులకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. 34వ వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు విజన్‌తో కూడిన ప్రణాళికలను రూపొందించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. కర్నూలు నగర అభివృద్ధిలో భాగంగా 34వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని చింతలపల్లి రామకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ స్కూల్ కరస్పాండెంట్ కొండమీది విజయ లక్ష్మి, కాపు నాడు రాష్ట్ర అధ్యక్షులు అర్జారామ కృష్ణ, రాయల అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రోపా ప్రధాన కార్యదర్శి , రాయలసీమ జేఏసీ చైర్మన్ అడ్వకేట్ కోనేటి వెంకటేశ్వర్లు, కాపు బలిజ జేఏసీ నాయకులు ముక్కమల్ల మురళి మోహన్, బలిజ సంఘం నాయకులు శోభన్ బాబు, వై మధుసూదన రావు, ప్రభాకర్ రెడ్డి, ఆదిశేషయ్య, కిరణ్, రామ స్వామి, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల సమయంలో వైసీపీ రౌడీయిజానికి పాల్పడుతోంది

### పుంగనూరు, రాయచోటి, తిరుపతిలో టీడీపీ నాయకులపై దాడులను ఖండించిన మంత్రి టీజీ భరత్



**కర్నూలు సిటీ నంది పత్రిక** పుంగనూరు, రాయచోటి, తిరుపతి ప్రాంతాల్లో టీడీపీ నాయకులపై వైసీపీ నేతలు దాడులకు పాల్పడటంపై రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ తీవ్రంగా మండిపడ్డారు. నామినేషన్ల సమయంలో వైసీపీ నేతలు రౌడీయిజానికి పాల్పడుతూ ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు సృష్టిస్తున్నారని విమర్శించారు.పదవుల్లో లేకపోయినా వైసీపీ నేతల తీరు మారలేదని, ఇప్పటికీ అదే దౌర్జన్యకర వైఖరిని కొనసాగిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు కూడా నామినేషన్ల సమయంలో టీడీపీ కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, గొడవలు సృష్టించడం వైసీపీ నేతల రాజకీయ శైలిగా మారిందని విమర్శించారు. వైసీపీ నేతల వ్యవహారశైలిపై ఎన్నికల సంఘం సీరియస్‌గా స్పందించాలని మంత్రి కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమికి భారీ మద్దతు ఇచ్చారని, ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని మంత్రి తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగితే ఓటమి తప్పదనే భయంతోనే వైసీపీ నేతలు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రజలు వైసీపీ నేతల వ్యవహారశైలిని గమనించాలని, తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని మంత్రి టీజీ భరత్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# హింస ద్వారా స్థానిక ఎన్నికలను అడ్డుకోవాలని గొడ్డలి పార్టీ కుట్రల చేస్తుంది

### ఎన్నికలు జరగకుండా వైసీపీ ముఠా తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్ లో అల్లర్లకు తెగబడుతోంది

### చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అల్లర్లు సృష్టించాలని చూసే వారిపై కఠిన చర్యలు

### కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల పై జరిగిన దాడులను ఎంపీ బస్తిపాటి నాగరాజు తీవ్రంగా ఖండించారు. హింస ద్వారా స్థానిక ఎన్నికలను అడ్డుకోవాలని గొడ్డలి పార్టీ కుట్రల చేస్తుందని మండిపడ్డారు.. పుంగనూరు, రాయచోటి, తిరుపతిలో జరిగిన దాడులు వైసీపీ పార్టీ హింస సంస్కృతికి నిదర్శనమని, ఓటమి భయంతో తొలి రోజు నుంచే దాడులు, హింసతో భయాందోళన సృష్టించాలని పన్నాగాలు పన్నుతోందన్నారు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతో ఎన్నికలు జరగకుండా వైసీపీ ముఠా తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్ లో అల్లర్లకు తెగబడుతోందని ఆరోపించిన ఎంపీ, గొడ్డలి పార్టీ కుట్రలను అధికారులు గట్టిగా అడ్డుకోవాలని కోరారు.. వైసీపీ నేతలే దాడులకు పాల్పడి, వారే తమ పై దాడులు చేసారని చెప్పుకోవడం విడ్డురంగా ఉందని, ప్రజా బలం , సంక్షేమం, అభివృద్ధి అజెండాతో నేరుగా ప్రజల ముందుకు వెళుతున్న కూటమి ప్రభుత్వానికి ఎవరి మీదా దాడులు చేయాల్సిన అవసరం లేదన్నారు.. ఇక చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అల్లర్లు సృష్టించాలని చూసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

# తాగడానికి నీళ్లు లేక అష్ట కష్టాలు

- ఇంటింటి కులాయి ఉన్న వ్యర్థమే
- 15 రోజులైనా నీళ్లు రాని వైనం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



**కొత్తపల్లి - నంది పత్రిక :** అసలే ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు కరువయ్యాయి. దీంతో భూగర్భ జలాలు కూడా రోజురోజుకు కుచించుకుపోతున్నాయి. వర్షాలు లేకపోవడంతో గ్రామాలలో నీటి ఎద్దడి మొదలవుతుంది. మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడింది. బీసీ కాలనీలైన బోయ, తెలుగు, చాకలి కాలనీలకు తాగడానికి నిరు రావడంలేదని కాలనీలవాసులు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు తాగడానికి నిరు ఇవ్వండి సార్ అంటూ అధికారులను బ్రతిమలాడుకోవాల్సిన గతి పట్టిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటి కుళాయిలు ఉన్న వాటికి నీళ్లు రావడంలేదని, 15 రోజుల నుండి నీరు రాక చిన్నపిల్లలను పక్కన ఉన్న కాలనీలకు పంపించి నీళ్లు తెచ్చుకుంటున్న పరిస్థితి నెలకొంది. వేరే కాలనీలకు వెళితే మాకు నీళ్లు సరిపోవు మీరు వస్తే అని అంటున్నారని కాలనీవాసులు తెలుపుతున్నారు. నీళ్లు ఇవ్వాలని పంచాయితీ కార్యదర్శి అడిగితే బావిలో నీళ్లు లేవని, భావి యజమానులతో మాట్లాడి చూస్తం అని దురుసుగా సమాధానం ఇస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీళ్లు వదిలినందుకు కుళాయి పన్ను అంటూ ఒక్కొక్కరి దగ్గర రూ.300 వసూలు చేసుకున్నారు గాని నీళ్లు రాలేదని అడిగితే వస్తాయిలెంటు వెళ్లిపోయారన్నారు తాగేందుకు నీళ్లు ఇవ్వమని అడిగితే పంచాయతీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని మండల స్థాయి అధికారులు చర్య తీసుకుని మంచినీరు సరఫరా చేయాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.



# ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.. మంత్రి టీజీ భరత్

### కర్నూలులో వైసీపీ నాయకుడు రంగాతో పాటు పలువురు టీడీపీలో చేరిక



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి పలువురు వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూలు నగరంలోని ఆయన కార్యాలయంలో 30వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు రంగా ఆయన అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, పలువురు నాయకులు టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, అయితే మంచి వ్యక్తులకు మాత్రమే పార్టీలో అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. గతంలో తెలుగుదేశం పార్టీలో ఉండి, ఆ తర్వాత పార్టీకి దూరమైన నాయకులు తిరిగి సొంత గూటికి చేరుతున్నారని పేర్కొన్నారు.మంత్రి టీజీ భరత్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి తాను తిరిగి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు రంగరాజు తెలిపారు.పార్టీలో చేరిన వారిలో మురళి, రవి, బాబు, మల్లికార్జున, రాజశేఖర్ రెడ్డి, తిలక్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, 30వ వార్డు ఇన్‌చార్జి రాజశేఖర్, బూత్ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల మొదటి రోజే హై టెన్షన్



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 16, నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పర్వం మొదటి రోజున హై టెన్షన్ నెలకొంది. శుక్రవారం వైసీపీ కి చెందిన ఐదుగురు కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు మున్సిపల్ కార్యాలయానికి వెళ్ళగా ఇద్దరి నామినేషన్లు మాత్రమే స్వీకరించారు. ఇతర నామినేషన్ల విషయంలో అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి మున్సిపల్ కార్యాలయానికి రావడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ఉద్రిక్తతను శాంతి వాతావరణంగా చేశారు. అనంతరం అసిస్టెంట్ ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ కిషోర్ మాట్లాడుతూ మొదటి రోజు రెండు వార్డులకు నామినేషన్లు దాఖలు అయ్యాయన్నారు. 16 వ వార్డుకు సంబందించిన అంబటి గోపాల్ రెడ్డి, 25 వ వార్డుకు సంబంధించి సింగారెడ్డి దామోదర్ రెడ్డిలు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. మరో రెండు రోజులు నామినేషన్లకు గడువు ఉంధన్నారు. అభ్యర్థులు అభ్యంతరాలు ఎదుర్కొనకుండా సరైన పత్రాలతో నామినేషన్ల దాఖలు చేయడానికి రావాలని ఆయన ఆహ్వానించారు.




### సికింద్రాబాద్‌లో కేజేఆర్ గార్డెన్ కూల్చివేత

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో దశాబ్దాలుగా వివాదాస్పదంగా ఉన్న కేజేఆర్ గార్డెన్‌ను కంటోన్మెంట్ బోర్డు అధికారులు శుక్రవారం పూర్తిగా నేలమట్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మించి, ఫంక్షన్ హాల్‌గా నిర్వహిస్తున్న ఈ కట్టడంపై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. న్యాయస్థాన ఆదేశాల మేరకు ఈ కూల్చివేత ప్రక్రియను చేపట్టారు.

### స్టాక్ మార్కెట్లకు ఐటీ బూస్ట్.. లాభాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో సెషన్‌లోనూ లాభాల జోరు కొనసాగించాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గడం, ముఖ్యంగా ఐటీ రంగ షేర్లలో బలమైన కొనుగోళ్లు జరగడం సూచీల పెరుగుదలకు దోహదపడింది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 413.70 పాయింట్లు (0.56%) లాభపడి 74,729.27

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #2-189, journalist colony, lakshmi narasimha swamy temple back side, Pulivendula Town, Y.S.R Kadapa District, Andhra Pradesh -PinCode:-516390, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:-APTEL/26/A6827 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

## మూలా నక్షత్రం సందర్భంగా శ్రీ సరస్వతి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చిన శ్రీ వాసవాంబ



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 16 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని అమ్మవారిశాలలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి మూలా నక్షత్రం సందర్భంగా శ్రీ సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఉత్సవ మూర్తిని శ్రీ సరస్వతీదేవిగా అలంకరించి అలంకార మండపంలో కొలువు తీర్చి పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉభయ దారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అలంకారాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్ బాబు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

**ఆళ్లగడ్డలో వైభవంగా బిందెసేవ ఉత్సవం** ఆళ్లగడ్డ పట్టణంలోని అమ్మవారి శాలలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి బిందెసేవ ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మూలా నక్షత్రం సందర్భంగా శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని కలశం లోకి ఆవాహన చేసి వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య బ్రహ్మచారులు అమ్మవారి కలశాన్ని నెత్తిపై పెట్టుకుని పట్టణంలోని ప్రతి ఆర్యవైశ్యుల ఇళ్ల వద్దకు ఊరేగింపుగా తీసుకొని వెళ్లి ఉత్సవంలో పాల్గొన్నారు. భక్తులు అమ్మవారికి కాయ కర్పూరం సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్ బాబు, ఆలువల చరణ్ బైసాని రవి నాగ ప్రదీప్ సాయిచరణ్ గోవిందరాజులు కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## మిథున్ రెడ్డి నీవు యం.పి.వా? లేక రౌడీవా ?

### ప్రజాస్వామము గురించి నీకు తెలుసా ?

### కుడా చైర్మన్ సోమిశెట్టి సూటి ప్రశ్న



**కర్నూల్ సిటీ నంది పత్రిక** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. అయితే వై.సి.పి.కి చెందిన మిథున్రెడ్డి ఈ రోజు నామినేషన్ల పర్వం ప్రారంభం రోజున పుంగనూరులో చేసిన అరాచకము చూస్తుంటే అతనొక యం.పి.నా! లేక రౌడీనా! అనే అనుమానం కలిగిందనీ కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అనుమానం వ్యక్తం చేశారు. జిల్లా టిడిపి కార్యాలయం నుండి పత్రికల వారితో మాట్లాడుతూ గతంలో వై.సి.పి. అధికారంలో ఉండగా గొడ్డలిపార్టీ అధ్యక్షులు జగన్మోహన్రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా చేసిన అప్రజాస్వామిక విధానాలను ఇంకా ఈ రాష్ట్ర ప్రజలు మరువలేదనీ, అందువల్లనే రాష్ట్రంలో గత సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, బిజెపి, జనసేన కూటమి కి 164 స్థానాలిచ్చి గొడ్డలిపార్టీ జగన్కు బుద్ధి చెప్పారనీ, అయినా జగన్కు జ్ఞానోదయం కలుగలేదనీ, వారి పిచ్చి పరాకాష్టకు చేరి ప్రస్తుతం జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో తాడేపల్లి ప్యాలెస్ నుండి తన పార్టీ వారికి ఖచ్చితమైన ఆదేశాలు జారీచేసి రాష్ట్రంలో ఎన్నికలు సజావుగా జరుగకుండా దాడులు, అరాచకాలు, సృష్టించాలనీ డైరెక్షన్ ఇచ్చారనీ వారి డైరెక్షన్లోనే ఈ రోజు నామినేషన్ల సందర్భంగా వై.సి.పి. గోడ్డలిపార్టీకి చెందిన మిథున్రెడ్డి పొరుగు రాష్ట్రాల నుండి రౌడీలను దింపుకొని పుంగనూరు, రాయచోటి, తిరుపతి, ప్రాంతాలలో దాడులకు తెగబడ్డారనీ, పుంగనూరులో తెలుగుదేశంపార్టీ వారి వాహనాలను ధ్వంసం చేయడం, తగులబెట్టడం వంటి చర్యలకు పూనుకొన్నారు. తిరిగి తెలుగుదేశంపార్టీ వారిపైనే ఆరోపణలు చేస్తూ టిడిపి వారు రౌడీయిజం చేశారనీ తప్పుడు మాటలు మాట్లాడుతున్నారు. ఒక యం.పి. అయ్యి ఉండి నామినేషన్లు వేసే ప్రాంతానికి వెళ్లాల్సి అవసరమేమనీ ప్రశ్నించారు. మిథున్రెడ్డి ఆరోపించినట్లు తెలుగుదేశంపార్టీ మీ పార్టీ వారిలా దాడులకు ఏనాడు దిగదనీ, మా పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రజాస్వామ్యంపై గౌరవంతో పార్టీ క్యాడర్ను ముందుకు నడిపిస్తున్నారనీ, వారు ఆదేశిస్తే మీరసలు రోడ్లపై తిరిగే వారు కాదనీ, అలాంటి నీచ సంస్కృతి మా పార్టీ నాయకునికి గానీ, పార్టీ క్యాడర్కు గాని లేదనే విషయాన్ని గుర్తుంచుకుంటే మంచిదనీ వివరిస్తున్నా. రాష్ట్రంలో ప్రదాని మోది గారి సహకారంతో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి పార్టీలకు రాష్ట్ర ప్రజలు ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని మెజార్టీని మరోసారి ఇవ్వబోతున్నారనీ, మీ నాయకుడు జగన కు ఆవిషయం తెలిసి పోయి, మతి స్థిమితం కోల్పోయి ఈ విధమైన అప్రజాస్వామిక విధానాలకు పార్టీ నాయకులను ఉ సిగొలుపుతున్నారనీ, రాష్ట్ర ప్రజలకు ఒకటే విజ్ఞప్తిచేస్తున్నా, ఇలా దౌర్జన్యకర సంఘటనలకు పాల్పడుతున్న గొడ్డలి పార్టీ నాయకులను నమ్మ వద్దనీ, మీరు వారిని నమ్మి మరోసారి మోసపోతే ఇప్పుడిప్పుడే గాడిలోకి వచ్చిన రాష్ట్రం తిరిగి మరలా అదోగతిపాలౌతందనీ, జగన్ లాంటి అరాచక శక్తిని నమ్మి మోసపోవద్దనీ, రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చేస్తున్న కూటమికి సంపూర్ణమైన మెజార్టీని ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికల్లో అపూర్వ విజయాన్ని అందివ్వాలనీ మరోసారి విజ్ఞప్తిచేస్తున్నాను.

## ఓటమి భయంతోనే వైసిపి అరాచకాలు

### పుంగనూరులో టిడిపి కార్యకర్తలపై వైసీపీ తీవ్రంగా ఖండించిన టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షురాలు ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి



**కర్నూల్ సిటీ నంది పత్రిక** చిత్తూరు జిల్లా పుంగనూరు ఘటనలో టిడిపి శ్రేణులపై వైసీపీ మూకలు చేసిన విచక్షణారహిత దాడిని టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షురాలు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, సీనియర్ నాయకులు నందికొట్కూరు ఇన్చార్జి గౌరు వెంకట్ రెడ్డి తీవ్రంగా ఖండించారు కల్లూరు అర్బన్ మాధవి నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి పాణ్యశీ ఎమ్మెల్యే టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి టీడీపీ సీనియర్ నాయకులు నందికొట్కూరు ఇన్చార్జి శ్రీ గౌరు వెంకట రెడ్డి మాట్లాడుతూ పుంగనూరులో జరిగిన ధ్వంసంతో గొడ్డలి పార్టీ వాళ్ళ నేర చరిత్ర నిరూపించుకున్నారని తెలిపారు దౌర్జన్యం , దాడులు, అరాచకాలతో ఎన్నికల్లో గెలవాలని గొడ్డలి పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు ఓటమి భయంతో ఇలాంటి హింసకు దిగుతున్నారని తాడేపల్లి నుంచి గొడ్డలి పార్టీ అధినేత ఆదేశాలతో పుంగనూరులో హింసకు దిగారు అన్నారు ఈ హింసకు పాల్పడ్డ వారిని వెంటనే అరెస్ట్ చేయాలి అని రాష్ట్ర డిజిపిని కోరారు గొడ్డలి పార్టీ అరాచకాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని వారు వివరించారు

## డి. శివ మృతదేహానికి సిపిఐ నాయకుల నివాళులు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** వెల్దుర్తి సిపిఐ రైతు సంఘం మండల నాయకులు డి. రాజు కుమారుడు డి. శివ మృతి పట్ల సిపిఐ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. డి. శివ మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నక్కి లెనిన్ బాబు, సిపిఐ వెల్దుర్తి మండల కార్యదర్శి టి. కృష్ణ, పట్టణ సహాయ కార్యదర్శి చిన్నమాదులు తదితరులు డి. శివ మృతదేహానికి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. డి. శివ మృతి ఆ కుటుంబానికి తీరని లోటని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని నాయకులు పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల తమ సంతాపాన్ని తెలియజేస్తూ, కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయాలి

### కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కాంగ్రెస్ శ్రేణులు కలిసికట్టుగా కృషి చేయాలి

### మాజీ కేంద్రమంత్రి, జేడీ శీలం



**కర్నూల్ సిటీ నందిపత్రిక** కాంగ్రెస్ పార్టీ తరపున కర్నూలు కార్పొరేషన్ మేయర్ మరియు కార్పొరేటర్ అభ్యర్థులుగా పోటీ చేయు ఆశావహులు ఎవరైనా కలిసికట్టుగా వారి గెలుపు కోసం కృషి చేయాలని మాజీ కేంద్రమంత్రి, ఏపీసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జే డి శీలం పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు జరిగిన కర్నూల్ కార్పొరేషన్ మేయర్ మరియు కార్పొరేటర్ ఆశావహుల సమావేశంలో జె డి శీలం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ అని, గల్లీ నాయకులను ఢిల్లీకి పంపిన ఘనత కాంగ్రెస్ పార్టీదని కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ గల పార్టీ అని అభ్యర్థులు ఎవరైనా కలిసికట్టుగా పనిచేయాలని కర్నూలు కార్పొరేషన్ మేయర్ పీఠం దక్కించుకొనుటకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని అలాగే కర్నూలు జిల్లా నందని ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని అలాగే కర్నూలు జిల్లా నందలి జడ్పిటిసి, ఎంపిటిసి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి ప్రచారం చేసి అధికార పార్టీ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కేంద్రంలో రాహుల్ గాంధీ ని ప్రధానిగా చేయడమే మన అందరి ఆశయమని జెడి శీలం అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఎఐసిసి సభ్యులు, జే లక్ష్మీ నరసింహ యాదవ్, కర్నూలు నంద్యాల డిసిసి అధ్యక్షులు అధ్యక్షులు బి క్రాంతి నాయుడు, మద్దిలేటి స్వామి, మాజీ ఎమ్మెల్సీ, ఏ ఐ సి సి సభ్యులు ఎం సుధాకర్ బాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలాని భాష, మాజీ డిసిసి అధ్యక్షులు కే బాబురావు నియోజక వర్గాల కోఆర్డినేటర్లు కాసిం వలి, అనంతరత్నం, అనుబంధ సంఘాల చైర్మన్లు బి బతుకన్న, ఎస్సీ బజారన్న, షేక్ హుస్సేన్, డివి సాంబశివుడు, ఎం మారుతీ రావు, మీసాల సుమలత, ప్రదీప్ రాయల్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రజాక్ వలి, ఐ ఎన్ టి యు సి రాష్ట్ర సెక్రెటరీ ఎం సుంకన్న, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, సయ్యద్ నవీద్, షేక్ మాలిక్ భాష, మహిళా కాంగ్రెస్ కే భాగ్యలక్ష్మి, లక్ష్మీదేవి మొదలగువారు పాల్గొన్నారు.

## కాటసాని రామభూపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వైస్సార్సీపీ కర్నూలు నగర మేయర్ అభ్యర్థి యం.సుశీల



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగర మేయర్ అభ్యర్థిగా ఎన్నికైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ కోడుమూరు ఎమ్మెల్యే మణి గాంధీ సతీమణి సుశీల , తన భర్త మణి గాంధీ తో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ని మరియు యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటసాని శివ నరసింహారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆత్మీయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్ రెడ్డి సుశీల ని అభినందిస్తూ, పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకునే దిశగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా ప్రజల్లోకి వెళ్లి పార్టీ విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ఎన్నికల భద్రతా ఏర్పాట్ల పై క్షేత్రస్థాయి పరిశీలన చేసిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

- ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి.
- పోలీసు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి.



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఎన్నికల భద్రతా ఏర్పాట్లలో భాగంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ శుక్రవారం ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని పలు కీలక ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ముందుగా ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని, అనంతరం బనవాసి సమీపంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మిగనూరు పట్టణంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రంతో పాటు వెంకటాపురం, ఆది ఆంధ్ర పాఠశాలలను పరిశీలించారు. అదేవిధంగా ఎమ్మిగనూరు గ్రామీణ పరిధిలోని కడిమెట్ల, ఎర్రకోట వంటి సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలను సందర్శించి శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎమ్మిగనూరు డీఎస్పీ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణ, సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా ప్రణాళికను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సీఐ చిరంజీవి, టౌన్ సీఐ కంబగిరి రాముడు, టౌన్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, నందవరం ఎస్ఐ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

## టిడిపిలో చేరిన 45 వ వార్డు వైసిపి కుటుంబాలు

### కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే గౌరు చరిత వెంకటరెడ్డి



**కర్నూలు సిటీ నంది పత్రిక** కల్లూరు అర్బన్ 45 వ వార్డ్ శివప్ప నగర్ వైసీపీ పార్టీకి చెందిన కడమంచి రామారావుతోపాటు 50 కుటుంబాలు ఎమ్మెల్యే గౌరు చరిత వెంకట రెడ్డి దంపతులు, యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరికీ గౌరు దంపతులు, యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు పార్టీలో చేరినవారు చిన్న సుంకన్న, తాటికొండ మారన్న, బాధిగా మారెప్ప, పెద్ద సుంకన్న, హనుమంత్, ఎల్లప్ప, కడమంచి, ముగ్గ గోవింద్, శాంత రాజు, మహేష్, డొక్కా ఈరన్న, డొక్కా జమ్మయ్య, బదిగ పెద్దూరు, కొండ్ర ఎల్లప ఆశీపయ్య, ఎల్లమ్మ, మారేమ్మ చేరారు ఈ కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి, ప్రభాకర్ యాదవ్, రవి ప్రకాశ్ రెడ్డి, జంగాల సుంకన్న, అర్బన్ మహిళా నాయకురాలు రాములమ్మ, బుల్లెట్ సుంకన్న, ఎల్లప్ప పాల్గొన్నారు

## టిడిపిలో చేరిన ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల లక్ష్మీకాంతయ్య



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల లక్ష్మీకాంతయ్య తోపాటు 25వ వార్డుకు చెందిన సంఘం నాయకులు కార్యకర్తలు టిడిపిలో చేరారు. బత్తుల లక్ష్మీకాంతయ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆంధ్ర ప్రదేశ్ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి సమక్షంలో టిడిపి సీనియర్ నాయకులు నందికొట్కూరు ఇంచార్జి గౌరు వెంకటరెడ్డి చేరిన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పిలుపునిచ్చారు. మహిళా సంఘం అధ్యక్షురాలు జీవీ చంద్రికమ్మ, మహిళా నాయకురాలు బత్తుల నాగమల్లి, ఇటిగోటి లక్ష్మీదేవి, వడ్డెర సంఘ నేతలు దేరంగుల సర్వేశ్వర బాబు ఇ తిరపతయ్య. చింతలపల్లి లక్ష్మీకాంత్, పి రాఘవేంద్ర, పల్లపు శంకర్ తదితరులు సుమారు వందమంది పార్టీలో చేరారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎల్ బండ రవి, చల్లా వెంకటేశ్వర్లు, ఎల్ల శివుడు, రామకృష్ణ, జానకి రాముడు, వరప్రసాదరావు మద్దిలేటి, ఆకాష్ రాజ్, శివ, అరవింద్, కొంతమంది వడ్డెర సంఘం నాయకులు రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య సమక్షంలో చేరారు కార్యక్రమంలో 25 వ వార్డు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# సిరిసంపదల తల్లీ.. మహానందిలో 'శ్రీ మహాలక్ష్మి'గా శ్రీ కామేశ్వరి దేవి..





### నంది వాహనంపై కాత్యాయని దుర్గగా కొలువైన అమ్మవారికి వైభవంగా గ్రామోత్సవం... ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు...

**మహానంది అక్టోబర్ 16 (నంది పత్రిక):–** ప్రముఖ శైవ క్షేత్రమైన మహానంది ఆలయంలో శ్రీ కామేశ్వరి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 6వ రోజైన శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం శ్రీ కామేశ్వరి అమ్మవారి మూలమూర్తి భక్తులకు 'శ్రీ మహాలక్ష్మి' రూపంలో దర్శనమిచ్చారు. అనంతరం సాయంత్రం నంది వాహనంపై 'శ్రీ కాత్యాయని దుర్గ' అలంకారంలో భక్తులకు కనువిందు చేశారు. ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి, చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర్ల ప్రత్యేకాధికార పర్యవేక్షణలో యాగశాలలో వేదపండితులు రవిశంకర్ అవధాని బృందం, రుత్వికులు, అర్చకుల ఆధ్వర్యంలో పూజల దాతలతో కలిసి నవదుర్గ కలశ అర్చనలు, శతచండీయాగము, శ్రీచక్ర నవావరణార్చనలను భక్తిశ్రద్ధలతో జరిపారు.సాయంత్రం వేళ అలంకార మండపంలో అమ్మవారికి కనుల పండుగగా సహస్ర దీపాలంకరణ సేవ, అష్టవిధ మహా మంగళహారతులు, సామూహిక కుంకుమార్చనలు వైభవంగా నిర్వహించారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం తాండవ కృష్ణ నృత్యాలయముకు చెందిన చిన్నారులు ప్రదర్శించిన నాట్య నివేదన కార్యక్రమం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి వేళ నంది వాహనంపై కాత్యాయని దుర్గగా కొలువైన అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం, మంగళ వాయిద్యాలు, మేళతాళాలు మరియు అశేష జనవాహిని నడుమ గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, ఏఈఓ మధు, ఆలయ పర్యవేక్షకులు శశిధర్ రెడ్డి, నీలకంఠేశ్వర రాజు, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్యలతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.





# సిరివెళ్లలో వైసీపీని వీడి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సమక్షంలో టిడిపిలో భారీ చేరికలు




**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 16 నంది పత్రిక** ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని సిరివెళ్ల మండల కేంద్రంలో పదవ వార్డుకు చెందిన ఫయాజుద్దీన్ హుస్సేన్ భాష రఫ్ తో పాటు 20 కుటుంబాలు వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సమక్షంలో శుక్రవారం నాడు తెలుగుదేశం పార్టీలో చేరారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ మీరంతా మన భూమా కుటుంబంలోకి రావడం ఎంతో సంతోషకరమన్నారు ఈరోజు తెలుగుదేశం పార్టీలో చేరడం కేవలం పార్టీ మార్పు కాదు మనపై మీరు పెట్టుకున్న నమ్మకానికి నిదర్శనం అని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు మీరు ఏ నమ్మకంతో అయితే మన దగ్గరికి వచ్చారు ఆ నమ్మకాన్ని నిండు పెట్టుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది నీకు ఎలాంటి సమస్య వచ్చినా మీకు అండగా నిలబడి మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భముగా మీ అందరికీ మాట ఇస్తున్నానని భూమా అఖిలప్రియ అన్నారు ఇటీవల 14వ వార్డులో కరీం కుటుంబం సభ్యులు కూడా టిడిపి పార్టీలో చేరారు ఇప్పుడు 10వ వార్డులో మరోసారి ఇంతటి ఆదరణ లభిస్తుందని ఇలా రోజురోజుకు సిరివెళ్లలో టిడిపి పార్టీకి ప్రజల మద్దతు పెరుగుతుందన్నారు అభివృద్ధిపై నమ్మకం భూమా కుటుంబం పై విశ్వాసం అన్నారు సిరివెళ్ల ఒక పెద్ద మండల కేంద్రమని ఇక్కడ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలంటే పెద్ద మొత్తంలో నిధులు అవసరమని అయినప్పటికీ గత రెండేళ్లలో సిరివెళ్ల మండల కేంద్ర అభివృద్ధి పనులు చేపట్టడానికి కృషి చేశామన్నారు రాబోయే రోజుల్లో మరిన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు మన లక్ష్యం ఒకటే సిరివెళ్ల అభివృద్ధి చెందాలి ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించాలి యువతకు భవిష్యత్తు ఉండాలి ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలన్నారు ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం అభివృద్ధి చేసి చూపించడం కష్టకాలంలో ప్రజలకు అండగా నిలబడుటనే భూమా కుటుంబం నమ్ముకున్న రాజకీయ విధానమన్నారు అందుకే ఈరోజు ప్రజలు మన దగ్గరకు వస్తున్నారని తమ భవిష్యత్తు బాగుండాలంటే తమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీతో కలిసి నడవాలని నిర్ణయించుకున్నారన్నారు వైకాపా అధికారంలో ఉన్న సమయంలో ఎన్నో హామీలు ఇచ్చారని కానీ ఆశించిన స్థాయిలో తమ సమస్యలు పరిష్కారం కాలేదని కొందరు నాయకులు కార్యకర్తలు చెబుతున్నారన్నారు వారి అభిప్రాయాలను గౌరవిస్తూ టిడిపి పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరిని సాదరంగా ఆహ్వానిస్తున్నామన్నారు మన పార్టీలో పాతవారు కొత్తవారు అనే తేడా లేదని అందరం ఒక కుటుంబంలో కలిసి పనిచేయాలన్నారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలి ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలి అనే ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు శ్రీకాంత్ రెడ్డి రామా టిడిపి కార్యకర్తలు భూమా అభిమానులు తదితరులు పాల్గొన్నారు



# ప్రతి గ్రామ పంచాయతీకి 'లోకల్ హీరో' పేరు!

గ్రామం అంటే తాటాకు ఇళ్లు, పెంకుటిళ్లు, అక్కడక్కడా డాబా ఇళ్లు, మట్టి రోడ్లు, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, ఓ చిన్న రాములోరి గుడి, పంచాయతీ ఆఫీసు అరుగులపై కూర్చుని, చుట్టలు కాల్చుకుంటూ దేశ రాజకీయాలపై చర్చలతో కాలక్షేపం చేసే గ్రామ పెద్దలు. గతంలో గ్రామం అంటే ఇలానే ఉండేది. కానీ, ఇప్పుడు గ్రామీణుల ఆలోచనా తీరు మారింది. వారి పిల్లలు అత్యున్నత విద్యా లక్ష్యాలను అందుకుంటున్నారు. ఇలా చదువుకుని, అలా విదేశాలకు వెళ్లిపోతున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ తదితర సివిల్ సర్వీస్ ఉద్యోగాలకు అలవోకగా ఎంపికవుతున్నారు. మట్టి రోడ్ల స్థానంలో సిమెంట్ రోడ్లు సాక్షాత్కరిస్తున్నాయి. విద్యుద్దీప కాంతులతో గ్రామాలు మెరిసిపోతున్నాయి. ఆధునిక మరుగుదొడ్లు లేని గృహం దాదాపుగా కనపడడం లేదు. ఎడ్ల బండ్ల స్థానంలో ట్రాక్టర్లు వచ్చేశాయి. కాలానుగుణంగా గ్రామసీమలలో ఇంత ఆధునికత కనపడుతున్నా చాలా గ్రామాలలో జీవకళ కనిపించడం లేదు. పట్టణీకరణపై గ్రామాలలో పెరుగుతున్న మోజుతో పాటు, గ్రామస్థులకు ఒక లక్ష్యం, ప్రేరణ కొరవడడం ప్రధాన కారణం. గ్రామాలలో జరిగే రాజకీయ అవినీతి పట్ల గ్రామీణులలో వ్యక్తమయ్యే అసహనం కూడా గ్రామాలను వీడడానికి ఒక కారణం అనేవారు ఉన్నారు. గ్రామీణులలో వ్యక్తమయ్యే నిర్లిప్తతను దూరం చెయ్యాల్సిన అవసరం ఉంది. లేకపోతే ఇక్కడ గతంలో ఓ గ్రామం ఉండేదని తరువాతి తరం వారు చెప్పుకునే పరిస్థితి వస్తుంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో దాదాపు ఇరవై ఐదు వేలకు పైగా గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 13,350 పంచాయతీలు ఉన్నాయి. వీటిల్లో పట్టణ లక్షణాలు ఉన్న గ్రామ పంచాయతీలు 360 ఉన్నాయి. గ్రేడ్1 పంచాయతీలు మూడు వేలు, గ్రేడ్2 పంచాయతీలు మూడున్నర వేలు, గ్రేడ్3 పంచాయతీలు దాదాపు ఏడు వేలు ఉన్నాయి. విదేశాలలో తెలుగు కీర్తి పతాకాలను ఎగరేస్తున్న వైద్యులు, ఇంజనీర్లు, రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు మొదలైన లక్షలాది మంది తెలుగుబిడ్డల్లో 90శాతం మంది గ్రామాల నుంచి వచ్చినవారే.

సెలబ్రిటీలుగా నీరాజనాలు అందుకుంటున్న వివిధ రంగాల తెలుగు ప్రముఖులలో 90శాతం మంది రాష్ట్రంలోని ఏదో ఒక గ్రామానికి చెందినవారే. వారంతా ఎన్ని కష్టనష్టాలకు ఓర్చి, ఆ స్థాయికి చేరుకున్నారో ఆయా గ్రామస్థులకు నిత్య స్మరణాంశంగా చేయాల్సిన అవసరం ఉంది. ఉదాహరణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నారావారి పాలెం గ్రామ పంచాయతీ, కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ బుర్రిపాలెం గ్రామ పంచాయతీ, నందమూరి తారక రామారావు నిమ్మకూరు గ్రామ పంచాయతీ, మండలి వేంకట కృష్ణారావు భావదేవరపల్లి గ్రామ పంచాయతీ, డాక్టర్ నోరి దత్తాత్రేయుడు మంటాడ గ్రామ పంచాయతీ, కొణిదెల చిరంజీవి మొగల్తూరు గ్రామ పంచాయతీ, కాకాని వేంకటరత్నం ఆకునూరు గ్రామ పంచాయతీ, కోట్ల విజయభాస్కరరెడ్డి లద్దగిరి గ్రామ పంచాయతీ, కోడి రామ్మూర్తి నాయుడు వీరఘట్టం గ్రామ పంచాయతీ, టంగుటూరి ప్రకాశం పంతులు వినోదరాయుని పాలెం గ్రామ పంచాయతీ, చంద్ర రాజేశ్వరరావు మంగళాపురం గ్రామ పంచాయతీ... ఇలా చాలా మంది పెద్దలు సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, వైద్య, రాజకీయ, క్రీడా రంగాలను విశేష రీతిలో పరిపుష్టం చేశారు. ఆయా గ్రామ పంచాయతీల పేర్లకు ముందు అధికారికంగా వారి పేరు పెడితే అది రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. ఆ పేర్లను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తే ఆయా గ్రామాల్లో ఉప్పొంగే కొత్త ఉత్సాహం, ఉద్వేగాన్ని కళ్లారా చూడవచ్చు. ముందుగా ప్రభుత్వం ఆయా గ్రామాలకు చెందిన ఓ 500 మంది సూపర్ సెలబ్రిటీలను గుర్తించి, వారు పుట్టి పెరిగిన గ్రామ పంచాయతీలను వారి పేర్లతో నోటిఫై చేస్తే... 'వెలిగొండ ప్రాజెక్ట్' అని పిలిచే దానికీ, 'పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్' అని పిలిచే దానికీ ఉన్నంత తేడా ఉంటుంది.



# అక్టోబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణకు చర్యలు

### "బుక్ ఏ కాల్ విత్ బీఎల్ఓ" ద్వారా ఓటర్ల సమస్యలకు పరిష్కారం

### జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్



**నంద్యాల బ్యూరో, అక్టోబరు 16(నంది పత్రిక):–** జిల్లాలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహిస్తూ, అక్టోబరు 30వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్‌లో ఓటర్ల జాబితా రూపకల్పనపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్ఓ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ పురోగతి, పెండింగ్ దరఖాస్తులు, నోటీసుల పరిష్కారం తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా తుది ఓటర్ల జాబితాను రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఫారాలు, నోటీసులకు సంబంధించిన పెండింగ్ పనులన్నింటినీ సకాలంలో పరిష్కరించినట్లు వెల్లడించారు. ఓటర్లు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, జాతీయ ఫిర్యాదుల సేవా పోర్టల్ (నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్) ద్వారా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా, "బుక్ ఏ కాల్ విత్ బీఎల్ఓ" సదుపాయం ద్వారా ఓటర్లు తమ సమస్యలను సంబంధిత బూత్ స్థాయి అధికారితో (బీఎల్ఓ) ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించుకునేందుకు అవకాశం ఉందని వివరించారు. ఓటర్ల జాబితా రూపకల్పనకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశంలో ప్రస్తావించిన అంశాలను పరిశీలించి, అవసరమైన తదుపరి చర్యల నిమిత్తం రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తామని డీఆర్ఓ తెలిపారు. తుది ఓటర్ల జాబితా రూపకల్పనలో పారదర్శకతకు, కచ్చితత్వానికి ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పకడ్బందీగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రియాజ్ బాషా, టీడీపీ ప్రతినిధి పటాన్ హుసేన్, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి సాయిరామ్ రెడ్డి, బీఎస్పీ ప్రతినిధి శ్రీనివాసులు, సీపీఐ ప్రతినిధి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవే లక్ష్యం.. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం 1వ వార్డు ఎంపీటీసీ బరిలో కూటమి అభ్యర్థి బిఎండి రఫీ

### ప్రజలకు అండగా అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా బిఎండి రఫీ ముందడుగు



**శిరివెళ్ల–: (నంది పత్రిక)** ప్రజాసేవే పరమావధిగా, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బి ఎండి రఫీ 1వ వార్డు ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. స్థానిక ప్రజల సమస్యలపై స్పందిస్తూ, అవసరమైన సమయాల్లో ప్రజలకు అండగా నిలుస్తూ బిఎండి రఫీ తనదైన గుర్తింపు సంపాదించుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన సమస్యలుగా భావించి, వాటి పరిష్కారం కోసం పలుమార్లు కృషి చేసిన వ్యక్తిగా బిఎండి రఫీ కి స్థానికంగా గుర్తింపు ఉంది. ప్రజలకు ఏ కష్టం వచ్చినా స్పందించడం, వారి ఇబ్బందులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, సమస్యల పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేయడం వంటి కార్యక్రమాల ద్వారా బిఎండి ప్రజలకు చేరువయ్యారు. ప్రజాప్రతినిధిగా పదవి ఉన్నా లేకపోయినా ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతూ, కాలనీలోని ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలు, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారిస్తూ వస్తున్నారు. ప్రజలతో నిత్యం మమేకమవుతూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా యువ నాయకునిగా ప్రజల్లో గుర్తింపు సాధించారు. కూటమి పార్టీల బలమైన వర్గం నుండి బిఎండి రఫీ ప్రజల ముందుకు వస్తున్నారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా స్థానిక ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ, కాలనీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన బిఎండి రఫీ అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా తన రాజకీయ ప్రస్థానాన్ని ముందుకు తీసుకెళ్లాలని భావిస్తూ ఒకటవ వార్డు ఎంపీటీసీ బరిలో నిలిచారు. 1వ వార్డు కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపించడం, మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేయడం, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని అందించడం వంటి అంశాలు బిఎండి రఫీ ముందున్న ప్రధాన లక్ష్యాలుగా నిలవనున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, వాటి పరిష్కారం కోసం నిరంతరం పనిచేసే నాయకత్వం అవసరమనే అభిప్రాయం స్థానికంగా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అనుబంధం కలిగి, ప్రజలకు అండగా కూటమి అభ్యర్థిగా బిఎండి రఫీ పోటీ చేయనున్నట్లు ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటివరకు చేసిన ప్రజాసేవను మరింత విస్తరించి, భవిష్యత్తులోనూ ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే సంకల్పంతో ఆయన ముందుకు సాగుతున్నారు. ప్రజల సమస్యలే తన ప్రాధాన్యతగా.. ప్రజాసేవే తన మార్గంగా భావిస్తున్న బిఎండీ రఫీ ఎన్నికల బరిలో కూటమి అభ్యర్థిగా విజయమే ధ్యేయంగా బరిలోకి దిగుతున్నట్లు పేర్కొన్నారు.

# పూలతేరుగా మూలవాగు..

రాజన్న క్షేత్రం పువ్వులతో పులకించగా.. మూలవాగు తీరం మురువంగా.. గంగాధరుడి సాక్షిగా గౌరమ్మ ఆడబిడ్డల కేరింతల నడుమ గంగమ్మ చెంతకు చేరింది. వేములవాడలో శుక్రవారం సద్దుల బతుకమ్మ సంబురం అంబరాన్నంటింది. తంగేడు పూల తళుకులతో.. గునుగు పూల మెరుపులతో.. గౌరమ్మను పేర్చి.. వేలాదిగా కదిలొచ్చిన ఆడబిడ్డలతో మూలవాగు తీరమంతా పూల జాతరై సాక్షాత్కరించే.. అన్నట్లు ఏడొద్దుల సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా పట్టణానికి చెందిన మహిళలు తీరొక్క పూలతో రంగురంగుల బతుకమ్మలను అందంగా పేర్చుకుని పట్టణ వీధుల్లో ఒక్కచోటు ఏర్పాటు చేసి వాటి చుట్టూ వలయాకారంలో తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలాడుతూ సంబరాల్లో మునిగితేలారు. మహిళలు బతుకమ్మ నిమజ్జనం కోసం విద్యుత్ దీపాలతో అత్యంత వైభవంగా ఏర్పాటు చేసిన మూలవాగు ఘాట్ వద్దకు రావడంతో ఆ ప్రాంతం పూల జాతరను తలపించింది. బతుకమ్మ ఘాటు వద్దకు బతుకమ్మలతో నిమజ్జనానికి వచ్చే మహిళలకు మున్సిపల్ సిబ్బంది పూలను చల్లుతూ స్వాగతం పలికారు.

## అనిరుధ్-కావ్య మారన్ వివాహం.. మొదలైన పెళ్లి సందడి, సీఎం రేవంత్‌కు ఆహ్వానం



గత కొంతకాలంగా దక్షిణాది సినీ, వ్యాపార వర్గాల్లో హాట్ టాపిక్‌గా నలుగుతున్న వార్తకు బలం చేకూరింది. సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్, సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్ కుమార్తె, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో కావ్య మారన్ వివాహ బంధంతో ఒకటి కాబోతున్నారు. ఈ వార్తలపై ఇప్పటివరకు ఇరు కుటుంబాల నుంచి అధికారిక ప్రకటన రానప్పటికీ, పెళ్లి పనులు వేగంగా జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. అనిరుధ్, కావ్య మారన్‌ల వివాహం నవంబర్ 11న గ్రీస్‌లో జరుగుతుందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. తాజాగా, సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్, ఆయన భార్య కావేరి మారన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న సీఎం నివాసంలో ఈ భేటీ జరిగింది. నవంబర్ 21వ తేదీన చెన్నైలో జరగనున్న తమ కుమార్తె కావ్య మారన్-అనిరుధ్ రవిచందర్‌ల వివాహ రిసెప్షన్‌కు హాజరుకావాల్సిందిగా వారు సీఎం రేవంత్ రెడ్డి దంపతులను ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ ఆహ్వానంతో రిసెప్షన్ తేదీపై స్పష్టత వచ్చింది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, డీఎంకే అధినేత స్టాలిన్ వంటి ప్రముఖులకు కూడా కళానిధి మారన్ స్వయంగా ఆహ్వాన పత్రికలు అందించనున్నారని సమాచారం. ఈ పరిణామంతో, త్వరలోనే మారన్ కుటుంబం నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని భావిస్తున్నారు.




# ‘రణబాలి’ – మూవీ రివ్యూ!







లవ్ .. రొమాన్స్ నేపథ్యంలోని కథలలో, తనదైన మాస్ యాక్షన్ మార్క్ చూపిస్తూ విజయ్ దేవరకొండ ముందుకు వెళుతున్నాడు. అలాంటి విజయ్ దేవరకొండ ఈ సారి చారిత్రక నేపథ్యంలో కథను ఎంచుకుని .. లుక్ మార్చుకుని ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. అలా ఆయన చేసిన సినిమానే ‘రణబాలి’. పెళ్లి తరువాత విజయ్ దేవరకొండ – రష్మిక కలిసి చేసిన సినిమా కావడంతో సహజంగానే అంచనాలు పెరిగిపోయాయి. గతంలో చారిత్రక నేపథ్యం కలిగిన ‘శ్యామ్ సింగరాయ్’తో నానీకి హిట్ ఇచ్చిన రాహుల్ సాంకృత్యన్, ఈ సినిమాతో విజయ్ దేవరకొండకి కూడా హిట్ ఇచ్చినట్టేనా అనేది చూద్దాం.అది 1870ల నాటి కాలం .. భారతదేశంపై ఆంగ్లేయులు ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న రోజులవి. బ్రిటీష్ కమిషనర్ (ఆర్నాల్డ్ వస్లూ) సీమ ప్రాంతం నుంచి 5 లక్షల టన్నుల ధాన్యాన్ని గూడ్స్ రైళ్ల ద్వారా తరలించి, మద్రాస్ ఓడరేవు నుంచి ఇంగ్లండ్ కి చేరవేసే ఆలోచనలో ఉంటాడు. అయితే అతనికి ‘శింగనమల’ ప్రాంతం నుంచి సవాల్ ఎదురవుతుంది. ఎందుకంటే ‘రణబాలి’ (విజయ్ దేవరకొండ) ఆ ప్రాంతానికి రక్షకుడిగా ఉంటాడు. అతనిని ఎదిరించే ధైర్యం .. ప్రశ్నించే దమ్ము ఎవరికీ లేవని ఆ ప్రాంత ప్రజలు నమ్ముతూ ఉంటారు. ‘శింగనమల’ ప్రజలు అక్కడి కొండపై గల గుహలో ఉన్న ఒక అతీత శక్తి తమని కాపాడుతుందని నమ్ముతుంటారు. ‘రణబాలి’ కారణజన్ముడనే విషయాన్ని అతని తల్లితో ఆ శక్తియే చెబుతుంది. అతను ఈ భూమిపైకి వచ్చిన కార్యం పూర్తవడానికి రెండు పుష్కరాల సమయం పడుతుందనీ, ఆ తరువాత అతను సమాధి చేయబడతాడని ఆ శక్తి చెబుతుంది. ఆ గండం నుంచి అతనిని గట్టెక్కించమని అందరి దేవుళ్లకి ఆ తల్లి దణ్ణం పెట్టుకుంటూ ఉంటుంది. అతను వయసులోకి అడుగుపెట్టిన తరువాత జయమ్మ ( రష్మిక)తో వివాహాన్ని జరిపిస్తుంది.సీమ ప్రాంతంలో కరవు ఏర్పడటానికి ప్రకృతి కారణం కాదనీ, తమ ప్రాంతంలోని ధాన్యాన్ని ఇంగ్లండ్ కి తరలించడానికి బ్రిటీష్ కమిషనర్ ప్రయత్నించడమేనని ‘రణబాలి’కి అర్థమవుతుంది. దానిని అడ్డుకోవడానికి అతను రంగంలోకి దిగుతాడు. అతని కారణంగా తిరుగుబాటు దారుల సంఖ్య పెరుగుతుందని భావించిన బ్రిటీష్ కమిషనర్, ఆవేశంతో బరిలోకి దిగుతాడు. అప్పుడు ఏం జరుగుతుంది? ఆంగ్లేయ అధికారి కోరిక నెరవేరుతుందా? రణబాలి ప్రయత్నం ఫలిస్తుందా? అనేది మిగతా కథ.ఆంగ్లేయుల కాలంలో వాళ్ల ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ ఆయా ప్రాంతాలలో వీరులు పుట్టుకొచ్చారు. ఆ వీరుల నాయకత్వంలో అక్కడి ప్రజలు తిరుగుబాటు జెండా ఎగరేశారు. అలా రాయలసీమ ప్రాంతం వైపు నుంచి ఆంగ్లేయుల పెత్తనాన్ని వ్యతిరేకించిన వీరుడిగా ‘రణబాలి’ని దర్శకుడు తెరపైకి తీసుకొచ్చాడు.

## చూపు తిప్పుకోనివ్వని అందంతో సాయి పల్లవి
## ‘రామాయణ’ ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణ

దేశవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం ‘రామాయణ’. ఈ భారీ బడ్జెట్ సినిమా అంతర్జాతీయ ట్రైలర్ విడుదల కార్యక్రమం నిన్న బెంగళూరులో అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో సీత పాత్రధారి సాయి పల్లవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తన పాత్రకు తగ్గట్టుగా, సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తూ ఆమె ధరించిన గులాబీ రంగు పట్టుచీర అందరి దృష్టినీ ఆకర్షించింది.నితీశ్ తివారీ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా తొలి భాగాన్ని దీపావళి కానుకగా విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు చిత్రబృందం మొత్తం హాజరైంది. రాముడి పాత్రలో నటిస్తున్న రణ్‌బీర్ కపూర్, రావణుడిగా యశ్, ఇంకా రవి దూబే, రకుల్ ప్రీత్ సింగ్, సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ వంటి ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సాయి పల్లవి ప్రత్యేకంగా డిజైన్ చేయించిన గులాబీ రంగు సిల్క్ శారీలో కనిపించారు. చీరపై వెండి జర్దోసీ వర్క్, వెండి బ్రోకేడ్‌తో వృత్తాకార మోటిఫ్‌లు, బోర్డర్ వెంబడి కట్‌వర్క్ డిజైన్ అద్భుతంగా ఉన్నాయి. దానికి సరిపోయేలా మోచేతుల వరకు చేతులున్న బ్లౌజ్‌ను ధరించారు. నగలు కూడా హుందాగా, తక్కువగా ఎంచుకున్నారు. స్టడెడ్ చెవిపోగులు, ఉంగరాలు, చేతికి కొన్ని గాజులతో చాలా అందంగా కనిపించారు. సహజంగా కనిపించేలా, తక్కువ మేకప్‌తో ఆమె మరింత అందంగా కనిపించారు.వేదికపై సాయి పల్లవి కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు.



## నిరసనలపై వివాదాస్పద వ్యాఖ్యలు
## విమర్శల తర్వాత క్లారిటీ ఇచ్చిన బ్రహ్మాజీ

ప్రముఖ నటుడు బ్రహ్మాజీ సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలను ఉద్దేశించి “నిరసన ఇప్పుడు ఒక కొత్త వృత్తి” అంటూ ఆయన చేసిన పోస్ట్‌పై నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో బ్రహ్మాజీ స్పందించి, తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు.ఇటీవల నీట్ పరీక్ష, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా వంటి అంశాలపై విద్యార్థులు, నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనలను కించపరిచేలా బ్రహ్మాజీ వ్యాఖ్యలు ఉన్నాయని పలువురు సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆయనపై తీవ్రస్థాయిలో ట్రోలింగ్ జరిగింది.ఈ విమర్శలపై బ్రహ్మాజీ మరో పోస్ట్ ద్వారా స్పందించారు. అన్ని నిరసనలు నిజమైనవి కావని, కొన్నింటి వెనుక స్వార్థ శక్తులు ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. “ప్రతి నిరసన ప్రామాణికమైనది కాదు. కొన్ని నిజమైన వ్యథల నుంచి పుట్టుకొస్తాయి. మరికొన్ని తెరవెనుక ఉన్న స్వార్థపరులైన శక్తుల చేత నిధులు సమకూర్చబడి, నిర్వహించబడి, నిర్దేశించబ డుతుంటాయి.



# బిజినెస్

## ఈ స్కూటర్లు భలే వెరైటీ.. భారత్‌లోకి ఇటలీ బ్రాండ్ ‘ఇటాల్‌జెట్’!



భారత ద్విచక్ర వాహన మార్కెట్లోకి మరో ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్ ప్రవేశిస్తోంది. ఇటలీకి చెందిన ప్రీమియం స్కూటర్ల తయారీ సంస్థ ఇటాల్‌జెట్ త్వరలో భారత్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించనుంది. ఇందుకుగానూ కొల్హాపూర్‌కు చెందిన మోటోహాస్ ఇండియా పంపిణీ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇటాల్‌జెట్ రాకతో ప్రీమియం స్కూటర్ల విభాగంలో పోటీ మరింత పెరగనుంది. ఇటలీలోని బోలోగ్నా కేంద్రంగా పనిచేసే ఇటాల్‌జెట్, తన అసాధారణమైన డిజైన్లు, అధిక పనితీరు గల స్కూటర్లకు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా ఈ సంస్థ అందిస్తున్న “డ్రాగ్‌స్టర్” సిరీస్ స్కూటర్లు తమ ర్యాడికల్ లుక్‌తో వాహన ప్రియులను ఆకర్షిస్తున్నాయి. భారత్‌లో ఏయే మోడళ్లను విడుదల చేయనున్నారు, వాటి ధరలు, లాంచ్ వివరాలను వచ్చే నెల మిలాన్‌లో జరిగే 2026 మోటార్ షోలో అధికారికంగా వెల్లడించనున్నారు. ఇటల్‌జెట్ లైనప్‌లో డ్రాగ్‌స్టర్ 125 నుంచి 700 సీసీ వరకు స్కూటర్లు ఉన్నాయి. వీటిలో అత్యంత శక్తివంతమైన డ్రాగ్‌స్టర్ 700 మోడల్, 698 లిక్విడ్-కూల్డ్ ట్విన్-సిలిండర్ ఇంజిన్‌తో వస్తుంది. ఇది 69 హ్రజూ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. దీనికి 6-స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్ జతచేయడం ఒక ప్రత్యేకత. అయితే, భారత మార్కెట్లోకి డ్రాగ్‌స్టర్ 125, డ్రాగ్‌స్టర్ 300 మోడళ్లను తీసుకొచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ స్కూటర్లు అండర్‌బోన్ ఛాసిస్, ప్రత్యేకమైన ఫ్రంట్ సస్పెన్షన్, బ్రాండ్ పేటెంట్ పొందిన ఇండిపెండెంట్ స్టీరింగ్ సిస్టమ్ , బయటకు కనిపించే ట్రెల్లిస్ ఫ్రేమ్ వంటి విశిష్టమైన ఫీచర్లతో వస్తాయి. ఇటాల్‌జెట్ రాకతో భారత వినియోగదారులకు ప్రీమియం స్కూటర్ల విభాగంలో ఒక కొత్త, విభిన్నమైన ఎంపిక అందుబాటులోకి రానుంది.

## స్టార్‌లింక్‌తో పోటీకి సై.. మేం భయపడం: మస్క్ వ్యాఖ్యలకు రిలయన్స్ కౌంటర్



ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవల్లో స్టార్‌లింక్ సహా ఏ సంస్థతోనైనా పోటీకి సిద్ధంగా ఉన్నామని రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పష్టం చేసింది. భారతీయ, విదేశీ సంస్థలన్నింటికీ దేశంలో ఒకే విధమైన నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది. స్టార్‌లింక్ భారత్‌లో ప్రవేశించేందుకు ఎదురవుతున్న నియంత్రణపరమైన అడ్డంకులపై ఎలాన్ మస్క్ విమర్శలు చేసిన నేపథ్యంలో రిలయన్స్ ఈ ప్రకటన చేసింది. భారత్‌లో పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలను స్వాగతించే వాతావరణం ఉందని రిలయన్స్ పేర్కొంది. అయితే దేశ చట్టాలు, విధానాలకు లోబడి ప్రతి సంస్థ పనిచేయాల్సిందేనని స్పష్టం చేసింది. భారత ప్రభుత్వ విధానం ప్రకారం దేశీయ, విదేశీ సంస్థలకు ఒకే విధమైన ప్రక్రియ వర్తిస్తుందని తెలిపింది. జియో ఉపగ్రహ సేవలకు సైతం ఇంకా అనుమతులు రావాల్సి ఉందని వెల్లడించింది. పోటీని స్వాగతిస్తున్నాం పోటీకి తాము ఎప్పుడూ భయపడలేదని, వినియోగదారులకు మెరుగైన సేవలు ఎవరు అందిస్తున్నారో నిరూపించుకునేందుకు పోటీనే సరైన పరీక్ష అని రిలయన్స్ పేర్కొంది. 2016లో టెలికాం రంగంలోకి అడుగు పెట్టినప్పుడు జియోకు ఒక్క వినియోగదారుడు కూడా లేడని గుర్తుచేసింది. పదేళ్లలో 53 కోట్లకు పైగా వినియోగదారుల నమ్మకాన్ని సంపాదిం చామని, ప్రపంచంలోనే అత్యంత అందుబాటు ధరల్లో డేటా సేవలను, మెరుగైన డిజిటల్ మౌలిక సదుపాయాలను అందిస్తున్నామని తెలిపింది. అంబానీపై మస్క్ వ్యంగ్యాస్త్రాలు భారత్‌లో ఉపగ్రహ కమ్యూనికేషన్ సేవలు అందించేందుకు స్టార్‌లింక్‌కు లైసెన్స్ లభించింది.

## పెట్రోల్ ఎగుమతులపై పన్ను పెంపు.. డీజిల్‌పై భారీగా తగ్గింపు



పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై విధించే పన్నుల్లో కేంద్ర ప్రభుత్వం మార్పులు చేసింది. పెట్రోల్ ఎగుమతులపై పన్నును లీటరుకు రూ.0.50 నుంచి రూ.2.50కు పెంచగా.. డీజిల్‌పై పన్నును రూ.16 నుంచి రూ.8.50కి తగ్గించింది. ఈ మార్పులు శుక్రవారం నుంచే అమల్లోకి వచ్చాయి. కేంద్ర ఆర్థిక శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు, పెట్రోలి యం ఉత్పత్తుల ధరల్లో వచ్చే మార్పులకు అనుగుణంగా ప్రభుత్వం ప్రతి 15 రోజులకు ఒకసారి ఎగుమతి సుంకాలను సమీక్షిస్తుంది. అంతర్జాతీయ చమురు ధరల్లో ఒడుదొడుకులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవలి నెలల్లో పలుమార్లు పన్నుల్లో మార్పులు చేసింది. సెప్టెంబర్‌లో పెట్రోల్ ఎగుమతులపై పన్నును లీటరుకు రూ.0.50కి తగ్గించగా.. తాజాగా దాన్ని రూ.2.50కు పెంచింది. డీజిల్ ఎగుమతులపై పన్నును ఆగస్టులో లీటరుకు రూ.25.50కు పెంచిన ప్రభుత్వం.. సెప్టెంబర్ సమీక్షలో దాన్ని రూ.19కు తగ్గించింది. ఇప్పుడు మరింత తగ్గించి రూ.8.50గా నిర్ణయించింది. విమాన ఇంధనం (ఏటీఎఫ్) ఎగుమతులపై కూడా గతంలో పన్నుల్లో మార్పులు చేసింది. అంతర్జాతీ యంగా ముడి చమురు ధరలు పెరిగినప్పుడు చము రు శుద్ధి సంస్థలు సాధించే అసాధారణ లాభాలపై పన్ను విధించేందుకు కేంద్రం 2022 జులైలో తొలిసారి విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను తీసుకొచ్చింది. 2026 మార్చిలో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా చమురు ధరలు పెరగడంతో ఈ పన్నును మళ్లీ అమల్లోకి తెచ్చింది.

## తండ్రికి తగ్గ తనయుడు.. వినూ మన్కడ్ ట్రోఫీలో వీరూ కొడుకు విధ్వంసకర సెంచరీ



భారత క్రికెట్ దిగ్గజం వీరేంద్ర సెహ్వాగ్ వారసుడిగా క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఆర్యవీర్ సెహ్వాగ్, తండ్రికి తగ్గ తనయుడనిపించుకున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న వినూ మన్కడ్ ట్రోఫీలో (అండర్-19 వన్డే టోర్నమెంట్) ఢిల్లీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్యవీర్, విధ్వంసకర సెంచరీతో అందరి దృష్టిని ఆకర్షించాడు. చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓపెన ర్‌గా బరిలోకి దిగి పరుగుల సునామీ సృష్టించాడు. కేవలం 143 బంతుల్లో 19 బౌండరీలు, 8 సిక్సర్ల సహాయంతో 173 పరుగుల భారీ స్కోరు సాధించి, తన తండ్రి దూకుడైన బ్యాటింగ్ శైలిని గుర్తుచేశాడు. 18 ఏళ్ల ఆర్యవీర్ ఇటీవలే భారత అండర్-19 జట్టు తరఫున కూడా అరంగేట్రం చేసి ఆకట్టుకున్నాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 109 పరుగులు చేసి మంచి ప్రతిభ కనబరిచాడు. వినూ మన్కడ్ ట్రోఫీలో ఢిల్లీ జట్టు ‘గ్రూప్-ఈ’లో చివరి స్థానంలో ఉన్నప్పటికీ, ఆర్యవీర్ ఒక్కడే ఒంటరి పోరాటం చేస్తూ జట్టులో మెరుస్తున్నాడు.వీరేంద్ర సెహ్వాగ్ కొడుకు కావడంతో ఆర్యవీర్‌పై సహజంగానే అంచనాలు, ఒత్తిడి ఎక్కువగా ఉంటాయి. అయితే, తన ఆటతీ రుతో వాటిని అధిగమిస్తూ తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. గతంలో తన కొడుక్కి ఇచ్చిన సలహా గురించి సెహ్వాగ్ మాట్లాడుతూ, “ఆర్యవీర్‌ను చూసి గర్వపడుతున్నాను. ఒత్తిడి ఉంటుందని నాకు తెలుసు, కానీ దాని గురించి ఆలోచించకుండా స్వేచ్ఛగా ఆడమని చెప్పాను. నిన్ను నువ్వు మైదానం లో ఆవిష్కరించుకో, పెద్ద స్కోర్ల గురించి చింతించకు. స్వేచ్ఛగా ఆడితే పరుగులు అవే వస్తాయని సలహా ఇచ్చాను” అని తెలిపాడు. కాగా, ఈ టోర్నమెంట్‌లో దిగ్గజాల వారసులు అదరగొ డుతున్నారు. మరో లెజెండరీ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్ కుమారుడు అన్వయ్ ద్రవిడ్ కూడా కర్ణాటక అండర్-19 జట్టు తరఫున అద్భుతంగా రాణిస్తున్నాడు. అతను కూడా ఒక సెంచరీ, అలాగే కేవలం 41 బంతుల్లో 85 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడి అందరి ప్రశంసలు అందుకున్నాడు. దీంతో ఇప్పుడు అందరి చూపు ఈ యువతరం ఆటగాళ్లపైనే ఉంది.

# స్పోర్ట్స్

## దుబాయ్‌లో సూర్యకుమార్ భారీ పెట్టుబడి.. షారుఖ్ ఖాన్ ప్రాపర్టీలో లగ్జరీ ఇల్లు కొనుగోలు!



టీమిండియాకు 2026 టీ20 ప్రపంచకప్ అందించిన కెప్టెన్, స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ దుబాయ్‌లో విలాసవంతమైన నివాసాన్ని కొనుగోలు చేశాడు. తన భార్య దేవిషా శెట్టితో కలిసి ఉన్న ఒక వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసి, ఈ శుభవార్తను అభిమానులతో పంచుకున్నాడు. బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ పేరుతో నిర్మించిన ‘షారుఖ్జ్ రెసిడెన్సెస్’ అనే అల్ట్రా లగ్జరీ ప్రాపర్టీలో సూర్య ఈ ఇంటిని కొన్నాడు.ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ.. “నేను మొదటిసారి 2014లో ఐపీఎల్ ఆడేం దుకు దుబాయ్ వచ్చాను. ఆ తర్వాత 2020లో కూడా వచ్చాను. ఇప్పుడు చూస్తే, యావత్ భారతదేశం దుబాయ్ వస్తోంది. ఇక్కడ లగ్జరీ, జీవన ప్రమాణాలు చాలా భిన్నంగా ఉంటాయి. ముంబైలో నేను నివసించే చోట భద్రత ఉంది, కానీ దుబాయ్‌లోని భద్రత కూడా చాలా బాగుంటుంది. ఇక్కడికి వచ్చినప్పుడు చాలా రిలాక్స్‌డ్‌గా, సంతోషంగా అనిపిస్తుంది” అని వివరిం చాడు. షారుఖ్ ఖాన్ ప్రాజెక్ట్‌లో ఇల్లు కొనడంపై ప్రత్యేకంగా స్పందించాడు. “షారుఖ్ సర్ పేరుతో ఇక్కడ ఒక బిల్డింగ్ కడుతున్నారని వినగానే, మరో ఆలోచన రాలేదు. ఇందులో ఇంటీరియర్ వర్క్, క్వాలిలిటీ అద్భుతంగా ఉన్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా లాంజెవిటీ, వెల్‌నెస్ సెంటర్ ఉండటం నాకు బాగా నచ్చింది” అని సూర్యకుమార్ తెలిపాడు. ఈ రెసిడెన్షియల్ ప్రాపర్టీలో హైపర్‌బారిక్ ట్రీట్‌మెంట్, రెడ్ లైట్ థెరపీ, క్రయోథెరపీ వంటి అత్యాధునిక ఆరోగ్య సౌకర్యాలు ఉన్నాయని ఆ వీడియోలో పేర్కొన్నాడు. “ఇక్కడ మరో విషయం గమనించాను. రక్త పరీక్ష లేకుండానే శరీరంలోని షుగర్ లెవెల్స్ నుంచి ఏ టు జెడ్ అన్నీ తెలుసుకోవచ్చు.

## అర్షదీప్ కు గాయం.. టీమిండియాలోకి సరైన టైమ్ లో సరైన బౌలర్ వచ్చాడు!



వెస్టిండీస్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో చివరి మ్యాచ్‌కు ముందు టీమిండియాలో కీలక మార్పు చోటుచేసుకుంది. యువ ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ గాయప డటంతో, అతని స్థానంలో అనుభవజ్ఞుడైన పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను జట్టులోకి చేర్చినట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. సిరీస్ లో చివరిదైన ఈ ఐదో మ్యాచ్ కు కీలక ప్రాధాన్యత ఉంది. ఈ పోరులో గెలిచిన జట్టు సిరీస్ విజేతగా నిలుస్తుంది. ప్రస్తుతం టీమిండియా, విండీస్ 2-2తో సమవుజ్జీలుగా నిలిచాయి. ఈ సమయంలో భువనే శ్వర్ కుమార్ వంటి సీనియర్ బౌలర్ రాక జట్టులో కొత్త ఉత్సాహాన్ని కలిగిస్తోంది.

**-వివరాల్లోకి వెళితే...**

హైదరాబాద్‌లో బుధవారం జరిగిన నాలుగో టీ20 మ్యాచ్ సందర్భంగా ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్ భుజానికి (కుడిచేతి వాటం బౌలర్ అయితే కుడి భుజం, ఎడమచేతి వాటం అయితే ఎడమ భుజం) గాయమైంది. ప్రస్తుతం అతను వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడు. గాయం తీవ్రతను అంచనా వేస్తు న్నామని, అతని కోలుకునే తీరును బట్టి శనివారం బెంగళూరులో జరగనున్న చివరి టీ20 మ్యాచ్‌లో ఆడే విషయంపై తుది నిర్ణయం తీసుకుంటామని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నేపథ్యంలో, ముందు జాగ్రత్త చర్యగా సెలక్షన్ కమిటీ భువనేశ్వర్ కుమా ర్‌ను స్క్వాడ్‌లోకి ఎంపిక చేసింది. ఒకవేళ అర్ష్‌దీప్ మ్యాచ్‌కు అందుబాటులో లేకపోతే, భువనేశ్వర్ తుది జట్టులో ఆడే అవకాశాలున్నాయి. ఈ సిరీస్‌లో చివరిదైన ఐదో టీ20 మ్యాచ్ అక్టోబర్ 17న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగ నుంది. వెస్టిండీస్‌తో ఐదో టీ20కి భారత జట్టు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), సంజూ శాంసన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, నమన్ ధిర్, భువనేశ్వర్ కుమార్.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com